# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం, 18 జూలై-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## 24 గంటల విద్యుత్తు ఇవ్వాలని ధర్నా



# రేవంత్ పన్నాగం విఫలం

- యువ సంగ్రామ సదస్సును అడ్డుకొనేందుకు కుట్రలు
- ఎన్ని నిర్బంధాలు విధించి నాయువత కోసం గళమెత్తుతం తేల్చిచెప్పిన కేటీఆర్



హైదరాబాద్, జూలై 17 : సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సును అడ్డుకొని, నిరుద్యోగ యువత గొంతు నొక్కేందుకు యత్నించిన సర్కార్ కుట్రలు పటాపంచలయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సభను అడ్డుకొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన కుటిలయత్నాన్ని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన ఎండగట్టారు. సదస్సుకు కాంగ్రెస్ అనుమతి నిరాకరిస్తే, ప్రజాస్వామిక హక్కులను కాపాడుతూ గౌరవ హైకోర్టు అనుమతిచ్చిందని స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా, నిర్బంధాలు మిగతా 3లో..

## ప్రత్యామ్నాయ పంటలకు రైతుల్ని

# సిద్ధం చేద్దాం

**ప్రభుత్వమే సేకరిస్తుందన్న భరోసా కల్పిద్దాం.. మంత్రివర్గ భేటీలో సీఎం**



హైదరాబాద్, జూలై 17: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా, అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశంగా చర్చించారు. రైతులు వరి నార్లు బతికించుకోవడానికి కొన్ని చోట్ల ఎకరానికి రూ.50 వేల చొప్పున ఖర్చు చేస్తున్నారని, వరుణు డు కరుణించని పక్షంలో ఆ మొత్తం వృధా అయ్యే పరిస్థితి కనిపిస్తోందని పలువురు మంత్రులు సమావేశం దృష్టికి తెచ్చారు. దీంతో రైతుల్ని ప్రత్యామ్నాయ పంటలకు మళ్లించాలన్న నిర్ణయానికి మంత్రివర్గం వచ్చింది. మంత్రులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల్ని ప్రత్యామ్నాయ పంటలకు సమాయత్తం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సమావేశాల ద్వారా, వీడియోల రూపంలో రైతుల్ని చైతన్య పరచాలని సూచించారు.

వాస్తవానికి తెలంగాణ నేల.. వైవిధ్యభరితమైన పంటలకు నిలయమని, వరి, పత్తి విస్తీర్ణం పెరిగాకే పరిస్థితి మారిందన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ముఖ్యంగా ఈ రెండు పంటలను మద్దతు ధరకు సివిల్ సప్లయ్స్, సీసీఐ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు సేకరించడం ప్రారంభించాకే ధర గ్యారెంటీ దొరికి.. వాటి విస్తీర్ణమూ పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మిగతా 3లో..

# ధరణి అక్రమాలపై సమగ్ర విచారణ

- వర్షాభావంపై పరిశీలనకు బృందాన్ని పంపాలని కేంద్రానికి లేఖ
- తాగు, సాగునీరు, విద్యుత్తు, వ్యవసాయంపై ప్రత్యేక కార్యాచరణ
- ఎల్‌నినో ప్రభావంపై చిన్నారెడ్డి సారథ్యంలో నివేదిక తయారీ
- 20న ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సమావేశాలు
- ఇంజనీరింగ్ పనులన్నింటికీ ఇకపై ఏకీకృత టెండర్ల విధానం
- శంషాబాద్ దగ్గర్లో రైల్ హబ్.. 'ముక్తేశ్వర్' పూర్తికి చర్యలు
- ధర్మపురి డిగ్రీ కళాశాలకు 29 పోస్టుల మంజూరు



హైదరాబాద్, జూలై 17: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు మిగతా 3లో..

# ఆరుతడి సాగుపైనా ఆశలు గల్లంతు!



- రాష్ట్రమంతటా వర్షాభావ పరిస్థితులు
- భారీగా తగ్గిన పంటల సాగు విస్తీర్ణం
- కేవలం 12 లక్షల ఎకరాల్లో వరినాట్లు
- ఆరుతడి పంటలపైనా లేని ప్రోత్సాహం
- పత్తి, మక్క సాగుపై రైతుల్లో గుబులు
- వానకాలం సాగుపై రైతుల వెనుకంజ

మిగతా 3లో..

# 'సర్' తర్వాత రేవంత్‌కు 2 ఓట్లుండవు

- రూల్స్ పాటించనందుకే మీనాక్షి నామినేషన్ తిరస్కరణ
- కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్‌కుమార్ వెల్లడి
- రిటర్నింగ్ ఆఫీసర్ నిర్ణయాన్ని తాము కూడా మార్చలేమని వ్యాఖ్య



హైదరాబాద్, జూలై 17 : 'సర్' ప్రక్రియ తర్వాత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి రెండుచోట్ల ఓటు హక్కు ఉండదని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డికి రెండుచోట్ల ఓటు హక్కు ఉందన్న విషయంపై స్పందిస్తూ.. 'సర్' ప్రక్రియ అనంతరం ఇలాంటి సమస్య ఉండదని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్

## గోదావరి జలాలతో చెరువులను నింపలేం!

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

హైదరాబాద్, జూలై 17 : గోదావరి జలాలతో చెరువులను నిం పడం సాధ్యం కాద ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతు లెత్తేశారు. జనగామ జిల్లా లింగాలఘ నపురంలో శు క్రవారం మీడియాతో ఆ యన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణను తనకు అప్పగిస్తే మూడు నెలల్లో నింపుతానని హరీశ్‌రావు అంటు న్నారు.. మేడిగడ్డ.. కన్నెపల్లి వద్ద అసలు నీటి ప్రవాహం లేనేలేదు.. ఎత్తిపోసే అవకాశమే లేదు అని పేర్కొన్నారు. భారీ నీటిపారుదల శాఖ మాజీ మంత్రిగా ఉన్న అనుభవంతో చెబుతున్నా.. నీళ్లను ఎత్తి పోయలేం అని పేర్కొన్నారు

# ఆకాశంలోకి ఆశల రాకెట్!

**ఉదయం 11.30 గంటలకు నింగిలోకి..**




హైదరాబాద్, జూలై 17: తక్కువ ఖర్చుతోనే ప్రపంచ స్థాయి సాంకేతికతను సాధించిన ఇస్రో... దేశానికి ఎన్నో చారిత్రక విజయాలు అందించింది. ఇప్పుడు ఆ వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ భారత అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి 'విక్రమ్-1' నాంది పలకనుంది. ఇస్రో రాకెట్లపై ఆధారపడకుండా.. కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టగల తొలి ప్రైవే టు రాకెట్ ఇదే. భారత్‌లోనే పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో, ప్రైవేటుగా అభివృద్ధి చేసిన ఈ మొట్టమొదటి ఆర్బిటల్-క్లాస్ రాకెట్‌ను హైదరాబాద్‌కు చెందిన స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' తయారు చేసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో 'మిషన్ ఆగమన్' పేరిట శనివారం చేపట్టనున్న విక్రమ్-1 ప్రయోగంతో భారత అంతరిక్ష పరిశోధనా రంగంలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి శనివారం ఉదయం 11.30 గంటలకు ఈ ప్రయోగం చేపట్టనున్నట్టు మిగతా 3లో..

# మళ్లీ కరోనా కలకలం

- ఏపీలో వారంలో నలుగురు మృతి..
- కేంద్రం, ఆంధ్రా సర్కార్ అప్రమత్తం
- సోయిలేని తెలంగాణ ఆరోగ్యశాఖ



హైదరాబాద్, జూలై 17 : పొరుగు రాష్ట్రమైన ఏపీలో కరోనా కలకలం సృష్టిస్తున్నది. ఏపీలోని కాకినాడ, కడప, గుంటూరు జిల్లాల్లో కేసులు నమోదవుతున్నట్టు స్థానిక ఆరోగ్యశాఖ అధికారులు చెప్తున్నారు. కొవిడ్‌తో ఇప్పటికే నలుగురు మృతిచెందారు. మృతిచెందినవారు ఇదివరకే పలురకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని, వారిపై కరోనా తీవ్ర ప్రభావం చూపి ఉండవచ్చని అక్కడి అధికారులు చెప్తున్నారు. స్థానికంగా కరోనా కేసులు నమోదవుతుండటంతో అప్రమత్తమైన ఏపీ సర్కార్ ప్రజలను జాగ్రత్తగా ఉండాలని, నియమాలు పాటించాలని సూచించింది. ముందు జాగ్రత్త చర్యలకు శ్రీకారం చుట్టింది. అనుమానిత లక్షణాలున్న రోగులకు పరీక్షలు జరుపడం, ఐసోలేషన్‌లో ఉంచడం వంటి చర్యలు చేపడుతున్నట్టు సమాచారం. జూన్ 26 నుంచి జూలై 15 వరకు ఏపీలో మొత్తం 67 కరోనా కేసులు

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు క్యాష్ లెస్

# కార్డులు పంపిణీ




హైదరాబాద్, జూలై 17: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారుల చిరకాల కోరిక నెరవేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ఓ ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించింది. ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద పూర్తిస్థాయి నగదు రహిత వైద్య సేవలను అధికారికంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నూతన విధానం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అత్యుత్తమ వైద్య సేవలు అందనున్నాయి. ఈ నూతన ఆరోగ్య పథకం సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం తాజాగా ఓ ప్రత్యేక డిజిటల్ హెల్త్ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. దీంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా డిజిటల్ హెల్త్ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. దీని ద్వారా దాదాపు 17.88 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, నిరుపేద పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఎలాంటి ముందస్తు చెల్లింపులు లేకుండా ఉచిత వైద్య సేవలు సులభంగా అందుతాయి. ఈ పథకాన్ని కొద్దిసేపటి కిందటే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రారంభించారు. మిగతా 3లో..

## ఎల్ నినోపై అధ్యయనం చేయండి

- వర్షాభావ పరిస్థితులపై కేంద్రానికి లేఖ రాయాలని క్యాబినెట్ నిర్ణయం
- తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం- 2018కి మంత్రి మండలి ఆమోదం
- ధరణిపై విచారణకు సెట్ ఏర్పాటు
- క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మిగతా 3లో..

## సాగుపై సోయిలేని సర్కార్

- కన్నెపల్లి నుంచి నీళ్ల ఎత్తిపోతపై కాంగ్రెస్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం
- కేసీఆర్‌పై కక్షతోనే రాష్ట్ర రైతులపై పగ: శ్రీనివాస్‌గౌడ్



మిగతా 3లో..

## ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ వ్యవహారం..

- రేవంత్ ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# గ్రామసభలో వాగ్వాదం



- గొడవ పడిన వ్యక్తులపై కేసు నమోదు
- ఎమ్మార్వో ఎదుట హాజరుపరచి బైండోవర్ చేసిన బోయినిపల్లి ఎస్ఐ రమాకాంత్

**బలగం టీవీ, బోయినిపల్లి;** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో శుక్రవారం రోజున నిర్వహించిన గ్రామసభలో వాగ్వాదం చోటుచేసుకుని, పరస్పరం దూషించుకోవడంతో పాటు ఇరు వర్గాలు చేతులతో ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి గొడవ పడిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఇరు వర్గాలకు చెందిన మొత్తం 12 మందిని కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ (ఎమ్మార్వో) ఎదుట హాజరుపరచి, బైండోవర్ చేశామని బోయినిపల్లి ఎస్ఐ ఎన్. రమాకాంత్ తెలిపారు.

# సీనియర్ జర్నలిస్టు గజ్జెల శ్రీనివాస కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన తూడి లచ్చన్న



**బలగం టీవీ, బోయినిపల్లి;** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గజ్జెల శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మరణించడంతో వారి యొక్క ఆర్థిక పరిస్థితిని వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకొని, ప్రముఖ సామాజికవేత్త తూడి లచ్చన్న వారి ఇంటికి విచ్చేసి, పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ: జర్నలిస్ట్ శ్రీనివాస్ నిరంతరం సామాజిక సేవలో భాగంగా అనేక కథనాలు రాసే వారని గుర్తు చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య, ఉపసర్పంచ్ కళ్ళేపల్లి చంద్రయ్య, గ్రామంలోని నాయకులు మల్లయ్య, చంద్రయ్య, తిరుపతి, సత్యనారాయణ, టీ.ఎల్ యువసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ వ్యవహారం..




## రేవంత్ ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు...

**బలగం టీవీ, హైదరాబాద్:** హైదరాబాద్ జీడిమెట్ల పరిధిలోని ఫాక్స్ సాగర్ చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి, హైడ్రాకు హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ల ఆస్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. దూలపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 118, 119, 122 ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని పేర్కొంటూ ప్రభుత్వం 2019, 2023లో జారీ చేసిన జీవోలను రద్దు చేసింది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై విచారణ పూర్తయ్యే వరకు భూ వినియోగ మార్పులు, సంబంధిత భవనాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు హైడ్రా, రెవెన్యూ అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయితే, ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. 2013లో విడుదలైన ప్రాథమిక నోటిఫికేషన్, అలాగే హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లోని క్యాడస్ట్రల్ మ్యాప్ ప్రకారం సర్వే నంబర్లు 118, 119, 122 ఎఫ్‌టీఎల్ పరిధిలో లేవని, ప్రస్తుతం కూడా బఫర్ జోన్ వెలుపలే ఉన్నాయని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న హైకోర్టు, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించిన అనంతరం పిటిషనర్ల ఆస్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వం, హైడ్రాకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది.

# సదస్సుకు హైకోర్టు అనుమతి..

- సభ నిర్వహించుకునే హక్కు ఉన్నదని స్పష్టం
- బీఆర్ఎస్ సభకు సర్కార్ అనుమతి నిరాకరణ
- ప్రభుత్వ వాదనను తోసిపుచ్చిన న్యాయమూర్తి



**హైదరాబాద్, జూలై 17 :** బీఆర్ఎస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 18న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 7గంటలలోపు సదస్సు నిర్వహించుకోవచ్చని స్పష్టంచేసింది. సదస్సును శాంతియుతంగా నిర్వహించాలని, జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని, రహదారుల దిగ్బంధం, ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దని ఆదేశించింది. రెచ్చగొట్టే ప్రసంగాలు, విద్వేషాలను ప్రేరేపించే వ్యాఖ్యలు చేయరాదని, చట్టం–శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు విధించే అన్ని సహేతుకమైన షరతులను పాటించాలని న్యాయమూర్తి జస్టిస్ టీ మాధవీదేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సదస్సు'కు మొదట పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. సభ అనుమతి కోసం చేసిన దరఖాస్తుపై పోలీస్ కమిషనర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరుతూ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది టీవీ రమణారావు వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామని కోర్టుకు వివరించారు. సభ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పించామని, భద్రత కోసం 25 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామని, 15 మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని, అగ్నిమాపక శాఖ ఫీజులు, స్టేడియం అద్దె తదితర చెల్లింపులు కూడా పూర్తిచేశామని, అయినా పోలీసులు అనుమతి మంజూరు చేయలేదని వాదించారు.

# ఎల్ నినోపై అధ్యయనం చేయండి

## క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, జూలై 17 :** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశమైంది. అనంతరం ఆ వివరాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జూపల్లి కృష్ణారావుతో కలిసి మీడియాకు మంత్రి పొంగులేటి వెల్లడించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగు, వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభావం, తాగు, సాగునీటి ఇబ్బందులు, ఉపాధి కూలీల పరిస్థితులను సమగ్రంగా వివరిస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించినట్టు చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపించాలని, ఎల్ నినో కంటింజెన్సీ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 40% వర్షపాతం లోటు ఉన్నదని, తాగు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు సరఫరాపై వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని వెల్లడించారు. రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ చిన్నారెడ్డి సారథ్యంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో కలిసి 'వ్యవసాయ రంగంపై ఎల్ నినో ప్రభావం'పై ప్రత్యేక నివేదిక రూపొందించాలని మంత్రివర్గం సూచించిందని తెలిపారు. ఈ నెల 20న ఉమ్మడి జిల్లాల వారీగా జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో అకడి ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. భూముల రికార్డులు, భూముల క్రయ విక్రయాలకు సంబంధించి ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి చెప్పారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన 2020 అక్టోబర్ 29 నుంచి రాష్ట్రంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా జరిగిన అన్నీ అనుమానాస్పద లావాదేవీలను లోతుగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ఇంజినీరింగ్ పనుల్లో అప్రైజల్ నుంచి ప్రాజెక్టు ప్రపోజల్, భూసేకరణ, టెండర్లు, బిల్లుల చెల్లింపు విధివిధానాలన్నింటికీ ఒక యూనిఫైడ్ విధానాన్ని రూపొందించాలని క్యాబినెట్ నిర్ణయించింది. పాలమూరు ఎత్తిపోతల పనుల అంచనాల పెంపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లను కో–ఆప్టెడ్ సభ్యులుగా నామినేట్ చేసేందుకు తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం–2019ను సవరించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదించినట్టు పేర్కొన్నారు. పంచాయతీల నిధుల నిర్వహణకు సంబంధించి ట్రెజరీలో జమ చేసే విధానం నిబంధనను మార్చి పంచాయతీరాజ్ చట్టం–2018లో సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలకు ప్రతిపాదించిన మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల అలైన్‌మెంట్లు, స్టేషన్ల స్థానాలను ఆర్ అండ్ బీ విభాగం రాష్ట్ర క్యాబినెట్‌కు తెలిపినట్టు తెలిపారు. ముక్తేశ్వర్ ఎత్తిపోతల పథకం (చిన్న కాళేశ్వరం) పూర్తికి, విద్యాశాఖలో పోస్టుల భర్తీకి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పొంగులేటి వెల్లడించారు.

# ర్యాగింగ్ చేయడం చట్టపరమైన నేరం..




## చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి.పర్శరాములు.

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:** ర్యాగింగ్ వల్ల విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, ర్యాగింగ్ చేయడం చట్టపరంగా శిక్షార్హమైన నేరమని, ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి పర్శరాములు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గాయత్రి డిగ్రీ & పీజీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి / కార్యదర్శి, పి.లక్ష్మణాచారి సమన్వయంతో విద్యాసంస్థల్లో "ర్యాగింగ్ అనే సామాజిక దుష్ప్రవర్తనను పూర్తిగా నిర్మూలించాలి" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్శరాములు మాట్లాడుతూ ర్యాగింగ్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని అన్నారు. కొత్తగా చేరిన విద్యార్థులు భయపడకుండా విద్యను అభ్యసించే వాతావరణాన్ని కల్పించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు పరస్పరం గౌరవం, స్నేహభావంతో మెలగాలని సూచించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, మత్తు పదార్థ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు, కుంట శ్రీనివాస్, బూర మధుసూదన్, పారా లీగల్ వాలంటీర్ సింధుజ కళాశాల ప్రిన్సిపల్ ప్రతిభ, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# 111 బస్తాల నకిలీ డీఏపీ పట్టివేత

## బిజినేపల్లి మండలం మహదేవునిపేటలో ఘటన



**బిజినేపల్లి, జూలై 17 :** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మహదేవునిపేటలో రైతుల వద్ద వ్యవసాయాధికారులు తనిఖీలు చేసి 111 బస్తాలు సీజ్ చేశారు. మరో 39 బస్తాలు పొలాల్లో చల్లుకోగా ఖాళీ సంచులను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ ఎరువులు ఎక్కడి నుంచి తెచ్చారన్న విషయాలపై ఆరా తీశారు. కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. రైతులు రాజు, బాలయ్య, రాములు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాములు, మన్నెపురెడ్డి, జైపాల్‌రెడ్డికి కర్ణాటక నుంచి వచ్చిన కొందరు రూ.1,600- 1,700కు బస్తా చొప్పున విక్రయించినట్లు కలెక్టర్‌కు వివరించారు. ఎరువులను పరీక్షించి హైదరాబాద్‌కు తరలించి నివేదికల తర్వాత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# సాగుపై సోయిలేని సర్కార్



- కన్నెపల్లి నుంచి నీళ్ల ఎత్తిపోతపై కాంగ్రెస్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం
- కేసీఆర్‌పై కక్షతోనే రాష్ట్ర రైతులపై పగ: శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్,జూలై17:** ఎల్‌నినో ప్రభావంతో కరువు తరుముకొస్తుంటే రాష్ట్రంలో సాగు విషయంపై కాంగ్రెస్ సర్కార్‌కు సోయి లేకుండా పోయిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. అప్రమత్తం కావాల్సిన ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తున్నదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా సాగునీళ్ల కోసం రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు వేసిన పత్తి విత్తనాలు మొలకెత్తకుండానే ఎండిపోతున్నాయని, వరినార్లకు ట్యాంకర్ల ద్వారా నీరందించే దుస్థితి నెలకొన్నదని తెలిపారు. నదుల నీళ్లను ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ఒడిసి పట్టుకొంటున్నాయని గుర్తు చేశారు. కానీ గోదావరి, కృష్ణా నీళ్లను ఎత్తిపోయకుండా రేవంత్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్షతోనే రైతులపై ప్రభుత్వం పగ సాధిస్తున్నదని ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ మోటర్లను ఆన్‌చేయ కుండా ఏపీకి నీళ్లను వదులుతున్నదని విమర్శించారు. పంటలు పం డితే బోనస్ ఇవ్వాల్సి వస్తుందని భావించిన ప్రభుత్వం.. నీరందిం చకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్‌పై కోపంతో రైతుల గొంతుకోయడం అన్యాయమని విమర్శించారు. అప్పుల విష యంలోనూ గత బీఆర్ఎస్ సర్కార్‌ను బద్నాం చేయడం బాధాకర మని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లుతెరిచి కన్నెపల్లి నుం చి నీళ్లను ఎత్తిపోసి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఉద్యో గాలివ్వకుండా నిరుద్యోగ యువతకు అన్యాయం చేసిన ప్రభుత్వం ఇప్పుడు సరూర్‌నగర్ బీఆర్ఎస్ సభను అడ్డుకొంటున్నదని ఆరోపించారు

# ఈసెట్ అప్లికేషన్ల గడువు పెంపు



**హైదరాబాద్, జూలై 17:** డిప్లొమా పూర్తిచేసిన వారికి ఈవినింగ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు కల్పించేందుకు నిర్వహించే టీజీ ఈసెట్ (వర్కింగ్ ప్రొఫెషనల్స్) షెడ్యూల్లో అధికారులు మార్పులు చేశారు. ఈ ఎంట్రెన్స్ దరఖాస్తుల గడువును పొడిగించారు. శనివారంతో గడువు ముగియనుండగా గడువును ఆగస్టు 14 వరకు పొడిగించారు.

# (మొదటిపేజీ తరువాయి)

## రేవంత్ పన్నాగం విఫలం



విధించినా కేసీఆర్ నేతృత్వంలోని గులాబీ దళం యువత తరఫున గళం విప్పుతూనే ఉంటుందని తేల్చిచెప్పారు. 'యువతీయువకుల్లారా పెద్దసంఖ్యలో తరలిండి.. నాడు యూ త్ డిక్లరేషన్ పేరిట మోసం చేసిన కాంగ్రెస్ మోసాలను ఎండగడుదాం' అని పిలుపునిచ్చారు. దగాచేసిన రేవం త్ సర్కార్ మెడలువంచి నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ల అమలుకు జంగ్‌సైరన్ పూరిద్దామని స్పష్టంచేశారు.

## ధరణి అక్రమాలపై సమగ్ర విచారణ



అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక విచారణ బృందాన్ని (ఎస్ఈటీ) ఏర్పాటు చేయనుంది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇక ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న దుర్భర పరిస్థితులపై కేంద్రానికి లేఖ రాసి, ఇక్కడి పరిస్థితుల అధ్యయనానికి కేంద్ర బృందాన్ని పంపాల్సిందిగా కోరాలని నిర్ణయించారు. దీంతోపాటు రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, అనుసరించాల్సిన ప్రణాళిక, ఏకీకృత టెండర్లు, పురపాలికల్లో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం, పంచాయతీల నిధులను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకునే అవకాశం వంటి పలు ప్రధాన అంశాలపై మంత్రివర్గం చర్చించి.. నిర్ణయాలు తీసుకుంది. సమావేశం ముగిసిన అనంతరం క్యాబినెట్ నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావుతో కలిసి మీడియాకు వివరించారు. 2020 అక్టోబరు 29న ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా అనుమానాస్పద లావాదేవీలన్నింటినీ లోతుగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించిందని పొంగులేటి తెలిపారు.

## ప్రత్యామ్నాయ పంటలకు రైతుల్ని సిద్ధం చేద్దాం

ప్రత్యామ్నాయంగా పప్పు ధాన్యాలు, నూనెగింజల పంటలనూ ప్రభుత్వం సేకరిస్తుందన్న భరోసా రైతుల్లో కల్పించాలని మంత్రులకు సీఎం సూచించారు. నూనెగింజల పంటల సేకరణకు కేంద్ర ప్రభుత్వమూ సానుకూలంగా ఉందన్నారు. రైతుల్ని ప్రత్యామ్నాయ పంటలకు సమాయత్తం చేయడం ఇబ్బందే అయినా.. వారు నష్టపోకుండా చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత అని అన్నట్లు సమాచారం.

## 'సర్' తర్వాత రేవంత్‌కు 2 ఓట్లుండవు

తిరస్కరణపైనా కీలక వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల నామినేషన్ పత్రాలు నింపే సమయంలో అన్ని కాలాలు భర్తీ చేయాలనే నిబంధన ఉన్నట్టు చెప్పారు. కొన్నిసార్లు ఎన్నికల అధికారులు చూసీచూడనట్టు ఉన్నా.. రాజకీయ ప్రత్యర్థు లు దాన్నే ఎత్తిచూపుతారని చెప్పారు. ప్రత్యర్థులు ఫిర్యాదు చేయకపోతే పరిస్థితి మరోలా ఉండేదేమో అని అన్నారు. కోర్టు కేసు వివరాలను భర్తీ చేయాలని మీనాక్షికి సమయం ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదని వెల్లడించారు. ఒకసారి రిటర్నింగ్ అధికారి నిర్ణయం తీసుకున్న తర్వాత సీఈసీ పరిధిలో ఏమీ ఉండదని, మీనాక్షి నటరాజన్ సుప్రీంకోర్టుకు వెళ్లినా.. ఆర్వో నిర్ణయాన్నే సమర్థించిందని గుర్తుచేశారు.

## ఆకాశంలోకి ఆశల రాకెట్!

స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ ప్రకటించింది. ఈ రాకెట్ ద్వారా నాలుగు చిన్న ఉపగ్రహాలు, మరో రెండు చిన్న పేలోడ్లను అంతరిక్షంలోకి పంపనున్నారు. ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభించనున్నారు. 5.30 గంటల కౌంట్‌డౌన్ పూర్తయిన తర్వాత విక్రమ్-1 నిప్పులు చిమ్ముతూ నింగిలోకి ఎగరనుంది.

## మళ్లీ కరోనా కలకలం

నమోదైనట్టు స్థానిక అధికారులు వెల్లడించారు. గడిచిన 15 రోజుల్లో దేశ వ్యాప్తంగా 399 కొవిడ్ కేసులు నమోదయ్యాయని, దేశంలోనే అత్యధికంగా కేరళలో 115కరోనా కే సులు నమోదైనట్టు సమాచారం. ని త్యం తెలంగాణకు రాకపోకలు సాగించే ఏపీలో కరోనా కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో కనీసం ప్రజలను అప్రమత్తం చేయాలనే సోయి తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖకు లేకపోవడం విడ్డూరం.

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు క్యాష్ లెస్ కార్డులు పంపిణీ




లబ్దిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ఉద్యోగులు, వారి కుటుంబాలకు నాణ్యమైన చికిత్స అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలను ప్రభుత్వం విస్తరించింది. ఇందులో భాగంగానే తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 886 ఆసుపత్రులను ఈ క్యాష్ లెస్ పథకం పరిధిలోకి తీసుకువచ్చింది. ఉద్యోగుల సౌకర్యార్థం ప్రభుత్వ వైద్యశాలలతో పాటు కార్పొరేట్ మెడికల్ కాలేజీలు కూడా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉన్నాయి. ఎంపిక చేసిన ఈ నెట్‌వర్క్ ఆసుపత్రులలో అందించే అన్ని రకాల శస్త్రచికిత్సలు, వివిధ పరీక్షలకు అయ్యే ఖర్చులను కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (జ+ూ) నిర్దేశించిన నిబంధనలు, ప్రత్యేక రేట్లకు అనుసంధానించారు. దీనివల్ల ఆసుపత్రుల యాజమాన్యాలు, ప్రభుత్వ అధికారుల మధ్య చికిత్సల బిల్లులకు సంబంధించి ఎటువంటి వివాదాలు లేకుండా, పారదర్శకంగా లావాదేవీలు పూర్తవుతాయి. రేట్ల అనుసంధానం వల్ల ఉద్యోగులపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడదు.

# ఆరుతడి సాగుపైనా ఆశలు గల్లంతు!

- రాష్ట్రమంతటా వర్షాభావ పరిస్థితులు
- భారీగా తగ్గిన పంటల సాగు విస్తీర్ణం
- కేవలం 12 లక్షల ఎకరాల్లో వరినాట్లు
- ఆరుతడి పంటలపైనా లేని ప్రోత్సాహం
- పత్తి, మక్క సాగుపై రైతుల్లో గుబులు
- వానకాలం సాగుపై రైతుల వెనుకంజ



**హైదరాబాద్, జూలై 17 :** ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా సగటు వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఆశించినంత వర్షాలు కురిసే పరిస్థితి లేక ఈ వానకాలం సాగు విస్తీర్ణంపై తీవ్ర ప్రభావం పడింది. అన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాక వర్షాధార పంటల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం ఊదరగొడుతున్నట్టుగా అరుతడి పంటలు సాగు చేయాలన్నా విద్యుత్తు కొరత రైతులను వేధిస్తున్నది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 134135 లక్షల ఎకరాలు సాగు లక్ష్యం కాగా, ఈ ఏడాది జూలై రెండోవారం వరకు సుమారు 33 లక్షల ఎకరాల్లోనే ఈ వానకాలం పంటలు సాగైనట్టు ఒక అంచనా. జూలై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు సాగు విస్తీర్ణం వేగంగా పెరుగుతుందని, ఆరుతడి పంటలు సాగు చేయాలంటూ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తున్నది.కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు మండలాల వారీగా ఆరుతడి పంటల సాగుపై రైతులను చైతన్య పరుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆరుతడి పంటలు పండించినా ప్రభుత్వం కొంటదో? లేదోనన్న భయం కూడా రైతాంగాన్ని వెంటాడుతున్నది. ఈ సీజన్లో వ్యవసాయం చేసే కంటే వచ్చే ఆలస్యంగానైనా వర్షాలు పడితే ప్రాజెక్టుల్లో నీళ్లు ఉంటే యాసంగి సీజన్‌లోనైనా సాగు చేసుకోవచ్చని భావిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు అంచనాలకు మించి సాగు చేసే పరిస్థితి ఉండేది. ఎరువులు, విత్తనాలు, విద్యుత్తు సరఫరాతోపాటు రైతుబంధు కూడా ఆసరా కావడంతో అన్నదాతలు ఆనందంగా పంటలు వేసేవారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అందుకు భిన్నంగా పరిస్థితి తయారైంది. ఏ ఒక్క రైతు కూడా ప్రభుత్వంపై భరోసా పెట్టి వ్యవసాయం చేయలేని పరిస్థితి దాపురించింది. మరోవైపు అక్కడక్కడా తొలకరి వర్షానికి నాటిన పత్తి మొలకలు వర్షాభావ పరిస్థితుల్లో వాడిపోతున్నాయి. వర్షాలు కురిస్తే తప్ప పప్పు ధాన్యాల సాగుకు రైతులు ముందుకొచ్చే పరిస్థితి లేదు.

12లక్షల ఎకరాల్లోనే వరిసాగు..దేశంలోనే వరి ఉత్పత్తిలో ప్రథమస్థానం సాధించిన తెలంగాణ రికార్డు సాధించింది. ఇదంతా గతం.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర లేక, ఎరువులు, విత్తనాల కొరత, విద్యుత్తు కోతలు, పంట పెట్టుబడికి అప్పులు చేయడం తదితర కారణాలతో వానకాలం సీజన్‌లో వరిసాగు గణనీయంగా తగ్గింది. తాజా వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 12 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేశారని అంచనా. ప్రతి ఏటా వానకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షల ఎకరాలకు పైబడి వరి పంట సాగయ్యేది. ప్రాజెక్టులు, చెరువులు, బోరుబావులు, కాలువల కింద విస్తృతంగా వరిని సాగు చేసేవారు. ఫలితంగా తెలంగాణ ధాన్యాగారంగా మారేది. ప్రభుత్వం ఈ వానకాలం నుంచి 7 రకాల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించడం కూడా వరిసాగు విస్తీర్ణం తగ్గడానికి మరో కారణంగా తెలుస్తున్నది. గతంలో కష్టపడి పండించిన పంటను కూడా రేవంత్ ప్రభుత్వం సరిగా కొనుగోలు చేయకపోవడంతో కల్లాల్లోనే వర్షాలకు తడిచి తీవ్రంగా నష్టపోయారు. బోనస్ ఇస్తామని ప్రకటించి చేతులెత్తేయడంతో రైతాంగం మద్దతు ధర లభించక దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో కొనుగోలు చేయకపోవడంతోపాటు కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికి మాత్రమే కొంటామని ప్రకటించడంతో రైతులంతా తీవ్రంగా నష్టపోయారు.

**పడిపోయిన పత్తిసాగు..** ప్రతి వానకాలం 52 లక్షల ఎకరాల్లో సాగయ్యే పత్తి.. ప్రస్తుతం 18 లక్షల ఎకరాలకు పడిపోయిందని అంచనా. అడపా దడపా పడిన వర్షాలకు పత్తి విత్తనాలు మొలకెత్తినప్పటికీ మరో వారం, 15 రోజుల్లో ఆశించిన మేరకు వర్షాలు పడకపోతే మొలకలు కూడా పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉన్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు రైతులు వర్షాధార పంటల విత్తనాలు చల్లనేలేదు. కనీసం జూలై, ఆగస్టులోనైనా వర్షాలు ఆశించిన మేర కురిస్తే పప్పుధాన్యాలతో పాటు మక్కజొన్న వేసే పరిస్థితి ఉంటుందని రైతులు అంటున్నారు. ఒకవేళ అది కూడా లేకపోతే ఆ పంటల సాగు కూడా పూర్తిగా తగ్గే ప్రమాదం ఉన్నది. కూరగాయల సాగుకు కూడా రైతులు ధైర్యం చేయడం లేదు. బోరు బావుల కింద వేసిన పంటలతో విద్యుత్తు కోతలు రైతులను కుదేలు చేస్తున్నాయి.

## జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆర్ఐ స్టోర్స్ ఆకస్మికంగా తనిఖీ



- ఎస్పీ మహేష్ బి. గీతే...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఆర్ఐ) స్టోర్స్ విభాగాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టోర్స్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, వాటి నిర్వహణ విధానాన్ని పరిశీలించిన ఎస్పీ, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పోలీసు శాఖకు సంబంధించిన సామగ్రి నిల్వలు, వాటి సంరక్షణ, పోలీస్ స్టేషన్లకు పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.స్టోర్స్‌లోని వస్తువుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని, అవసరమైన సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే స్టోర్స్ కార్యాలయ పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, రికార్డుల నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని, స్టోర్స్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీలో ఎస్పీ వెంట ఆర్ఐలు మధుకర్, సురేష్, రమేష్, ఎస్ఐ రాజుతో పాటు స్టోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిరిసిల్లలో కాంగ్రెస్ బలోపేతం

### వార్డు అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల జూలై, 17**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం కోసం నూతన వార్డు అధ్యక్షుల నియామక ప్రక్రియను ప్రారంభించారు.సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటనలు నిర్వహిస్తూ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.శుక్రవారం పట్టణంలోని 10, 11, 12, 24వ వార్డుల నూతన అధ్యక్ష పదవుల కొరకు ఆశావహుల నుండి దరఖాస్తులను సేకరించారు. జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు మాట్లాడుతూ "పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తూ, సంస్థాగత బలోపేతానికి శ్రమించే నాయకులు, కార్యకర్తలకే వార్డు అధ్యక్షులుగా అవకాశం కల్పిస్తామని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం.ప్రజల్లో పార్టీ పట్ల మరింత మద్దతును కూడగట్టడం.తదుపరి చర్యలు: వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరలోనే అర్హులైన నాయకులకు ఆయా వార్డుల బాధ్యతలను అప్పగించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో ఆర్టిఏ నెంబరు సంగీతం శ్రీనాథ్ గారు మాజీ వైస్ ఎంపీపీ చల్ల హరికృష్ణ ఆకునూరి బాలరాజు యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దేవరాజ్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు సుంకరి సాయి ఆడెపు ప్రసాద్ సదుల గంగాధర్ కోలకాని రాజేశం నాగభూషణం మేన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం

- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- మంత్రిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**బలగం టీవీ, హైదరాబాద్, జూలై 16:** రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొ న్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి "టీడబ్ల్యూ జేఎఫ్ మీడియా డైరీ"ని అందజేసింది.ఈ సం దర్భంగా ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సంక్షేమ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమ స్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరి ష్కార మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతా యుతంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి.రవికుమార్, పర్కాలసమ్మయ్యగౌడ్, చొల్లేటి బ్రహ్మచారి, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

## బుల్లెట్ రైల్ కారిడార్ లపై రేవంత్ సర్కార్ కీలక అడుగు..

### క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్!

**హైదరాబాద్,జూలై 17:** భారతదేశంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న బుల్లెట్ రైలు ప్రాజెక్టుల కోసం రెడీ అవుతున్న తెలంగాణ కీలకమైన అడుగు వేసింది. బుల్లెట్ రైలు ప్రాజెక్టులలో భాగంగా తెలంగాణ రాజధాని హైదరాబాద్ కీలకమైన హై స్పీడ్ రైల్వే హబ్ గా రూపాంతరం చెందుతోంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మూడు భారీ బుల్లెట్ రైలు కారిడార్ లకు హైదరాబాద్ ప్రధాన కూడలిగా మారుతుంది. పక్క రాష్ట్రాలలోని ప్రధాన నగరాలను అనుసంధానం చేస్తూ కేంద్రం రూపొందించిన హై స్పీడ్ రైలు కారిడార్ల అలైన్మెంట్ లు, స్టేషన్లు, డిపోలకు సంబంధించి సవరించిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. శంషాబాద్ సమీపంలో ప్రధాన రైల్వే స్టేషన్ డిపో కోసం 400 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయించింది. హై స్పీడ్ రైలు కారిడార్ లకు అనుగుణంగా తుది అలైన్మెంట్ ను హెచ్ఎండిఏ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ లో కూడా చేర్చాలని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి భూసేకరణ, యుటిలిటీల మార్పు, వివిధ శాఖల అనుమతుల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ప్రతిపాదిత మూడు ప్రధాన రైలు కారిడార్ల అలైన్మెంట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ కు పంపించనుంది. హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్ చెన్నై, హైదరాబాద్ పూణే మూడు కారిడార్ల అలైన్మెంట్ కు ఆమోదం తెలిపిన క్యాబినెట్ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అలైన్మెంట్ లు, స్టేషన్లు, డిపోలను నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 512 కిలోమీటర్ల హై స్పీడ్ రైల్వే ట్రాక్ ఉండనుంది. హైదరాబాద్ చెన్నై ప్రాజెక్టును నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ మొదటి నార్కెట్పల్లి, సూర్యాపేట, ఖమ్మం మీదుగా ప్రతిపాదిస్తే రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఫ్యూచర్ సిటీ, నాగార్జునసాగర్ వైపు అలైన్మెంట్ ని మార్చారు. ఇక హైదరాబాద్ బెంగళూరు మార్గం తొలుత మహబూబ్నగర్ వనపర్తి రోడ్డు వైపు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో ఫ్యూచర్ సిటీ, మన్ననూరు, సోమశిల వైపు అలైన్మెంట్ ను మార్చారు. ఇది శ్రీశైలం మీదుగా వెళ్లేలా ప్లాన్ చేశారు. ఇక హైదరాబాద్ పూణే ముంబై రైలు కారిడార్‌ను హైదరాబాద్లోని శంషాబాద్, సైబరాబాద్, వికారాబాద్ మీదుగా అలైన్మెంట్ చేశారు. కేంద్రం ఇస్తున్న హై స్పీడ్ రైలు ప్రాజెక్టులను రాష్ట్ర పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక అడుగును వేసింది.

## 24 గంటల విద్యుత్తు ఇవ్వాలని ధర్నా

### బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

**హైదరాబాద్, జూలై 17:** రైతుల ఉసురుపోసుకుంటున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి భవిష్యత్‌లో పుట్టగతులుండవని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, అడ్‌హాక్ కమిటీ మండల సమన్వయకర్త పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్తు సరఫరా చేయాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం సబ్‌స్టేషన్‌లో ఆందోళన చేపట్టారు. రైతుల పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నదని మండిపడ్డారు. మైలారం రిజర్వాయర్‌కు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# నిరుద్యోగ సమస్యను పరిష్కరించండి



**హైదరాబాద్, జూలై 16 :** నీళ్లు,నిధులు, నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుంది. 1969లో కొనసాగిన తొలి దశ తెలంగాణ రాష్ట్ర పోరాటంలో 369 మంది బలిదానం తరువాత తెలంగాణ ప్రాంతం ప్రజలు చైతన్యమైన తరుణంలో 1996 లో చిన్న రాష్ట్రాలకి మేము అనుకూలమని ఆనాటి ప్రధానమంత్రి దేవె గౌడ్ ప్రకటన మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసింది. మలిదశ ఉద్యమంలో 1200 మంది పైగా విద్యార్థులు యువకులు ఆత్మబల్లి దానం వల్ల వచ్చిన తెలంగాణ లో 12 సంవత్సరాలు దాటిన పది సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఏ విధంగా మోసం చేసిందో టిఆర్ఎస్ ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే ధోరణిలో పనిచేస్తుంది. ప్రభుత్వాలు మారిన నిరుద్యోగులు, విద్యార్థుల బతుకులు మారడం లేదు భౌగోళిక తెలంగాణ ఏర్పడితే అట్టడుగు ప్రజల ప్రయోజనాలు మారుతాయి అనుకుంటే పాలకవర్గ వారి ప్రయోజనాలు మాత్రమే మారుతున్నాయి. తెలంగాణలో విద్యార్థులు, నిరుద్యోగులు వివక్షతకు గురవుతున్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అధికారంలోకి రావడం కోసం 6 గ్యారెంటీలతోపాటు 420 హామీలను ఇచ్చి ప్రతి ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. డిసెంబర్ 2023 లో అధికారం లోకి వచ్చిన జవీ రేవంత్ రెడ్డి, డిప్యూటీ ఎఎ బట్టి విక్రమార్క ల చెప్పిన లెక్కల ప్రకారం 1 లక్ష ఉద్యోగలు భర్తీ చేశాం అని చెప్పుతున్నారు.కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత భర్తీ అయ్యింది 67,763 పోస్టులు మాత్రమే అందులో గత దీ=ా ప్రభుత్వం నోటిఫికేషన్ లు చేసినవి 50,785 పోస్టులు కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ వేసిన పోస్టులు 31, 798 ఇందులో భర్తీ 16,978 పోస్టులు భర్తీ అయ్యింది. ఇంకా 30 వేల పోస్టు లు ప్రాసెస్ లోనే ఉన్నాయి. రాజీవ్ యువ వికాస్ ద్వారా 5 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రతి ఏటా 3నుండి 4 లక్షల మంది గ్రాడ్యుయేట్స్ తయారవుతున్నారు. ఇప్పటికే రాష్ట్రములో 55 లక్షల మంది గ్రాడ్యుయేట్స్, నాన్ గ్రాడ్యుయేట్స్ ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగ భృతి 4 వేయ్యి లు ఇస్తాం అన్నారు, దాని ఊసే లేదు.నిరుద్యోగ సమస్య రోజురోజుకీ పెరిగి పోతుంది కానీ ఉద్యోగ నోటిఫికేషన్లు రాకపోవడం మూలంగా నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో ఏళ్ల తరబడి చదువుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని ఆత్మహత్య చేసుకుంటున్నారు.ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం చేయకపోగా ప్రభుత్వ పాఠశాలను మూసివేయడం కోసం ప్రయత్నం చేస్తుంది. గత ప్రభుత్వంలో ఐదు వేల పాఠశాలను మూసివేస్తే నేడు 27 వేల పాఠశాలలను 4000 పాఠశాలలగా కుదించాలని చూస్తా ఉంది.నేటికి విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తుంది. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల పర్మిషన్ ఇస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలు కల్పించకపోగా పోస్టులను భర్తీ చేయడం లేదు. నేటికీ ప్రభుత్వ పాఠశాలలో 19,000 లకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 5000 పాఠశాలలపైగా టాయిలెట్స్ లేనివి,424 కరెంటు లేనివి, 500 తాగునీరు లేనివి, 4460 ఆటస్థలం లేనివి, 8045 లేని పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 430 ఉంటే వాటిలో జూనియర్ లెక్చరర్ పోస్టులు 1500 ప్రిన్సిపల్ పోస్టు 68 నాన్ టీచింగ్ పోస్టులు 1200 మొత్తం 2768 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాంటాక్ట్ లెక్చరర్స్ రెగ్యులరేజే షన్ 3500 ఇంకా ప్రాసెస్ లోని ఉన్నాయి. మోడల్ స్కూల్ 687 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.కే జీ బి వి పాఠశాలలో టచింగ్ డనాన్ టీచింగ్ కలిపి 1095 ఖాళీలు ఉన్నాయి ఇలా అన్నీ శాఖ లో ఖాళీ లు ఉన్నాయి. కాని ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. కామారెడ్డి డిక్లరేషన్ లో దీషి యువత కి 10 లక్షల రూపాయలు వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తాం అన్నారు. ఏ నోటిఫికేషన్ కి అయినా పరీక్ష ఫిజు ఉండదు అని 1000 రూపాయలు పరీక్ష ఫిజు పెంచారు. ౹౼రాజ పక్షాళన చేస్తాం అన్నారు. అది ఉంతా మాటలే అయింది. సరూర్నగర్ స్టేడియంలోని యూత్ సంఘర్షణ సభలో ప్రియాంక గాంధీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ప్రతి ఏడాది మెగా డీఎస్సీ, ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తామని, 18 ఏళ్లు పైబడిన బాలికలకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఇస్తామని, అమర వీరుల కుటుంబాలకి నెలకు 25,000 పెన్షన్ ఇస్తామని, అమరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని, టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజ్ పై విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. కాని ఎక్కడ అమలు చేయడం లేదు. 700 జతీశీ పోస్టులు పడితే 10 లక్షల 58,000 మంది దరఖాస్తులు చేసుకున్నారు దీన్ని బట్టి చూస్తే నిరుద్యోగ సమస్య ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు ఇప్పటికే అయినా తెలంగాణ రాష్ట్రము లో నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి. నిరుద్యోగ సమస్య పై యువత, తెలంగాణ ప్రజలు పోరాటం చేయాలి.



**పోలేబోయిన కిరణ్**
**పీవైఎల్ నాయకులు**

# గౌరీకుండ్ వద్ద భారీ అడ్డంకి: కేదార్‌నాథ్ యాత్రకు బ్రేక్





ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న కుంభవృష్టి కారణంగా ప్రముఖ శైవక్షేత్రం కేదార్‌నాథ్ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. భారీ వర్షాల వల్ల గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్ వెళ్లే ప్రధాన నడక మార్గంలో పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రుద్రప్రయాగ జిల్లా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఈ ఉదయం ఆదేశాలు జారీ చేశారు. హిమాలయ పర్వతాలపై నుంచి నిరంతరాయంగా బురదతో కూడిన శిథిలాలు, పెద్ద పెద్ద బండరాళ్లు కిందకు దూసుకువస్తుండటంతో రోడ్డు మొత్తం దెబ్బతింది. ఈ ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా ఈ ఉదయం నుంచే భక్తుల ప్రయాణాలను యంత్రాంగం పూర్తిగా నిలిపివేసింది. కేదార్‌నాథ్ దర్శనానికి తరలివచ్చిన వేలాది మంది యాత్రికులను మరింత ముందుకు సాగనివ్వకుండా గౌరీకుండ్, సోన్‌ప్రయాగ్ పరిసరాల్లో ఆశ్రయాల వద్ద ఆపివేశారు. వారికి అవసరమైన రక్షణ కల్పిస్తున్నారు. ఏకధాటిగా కురుస్తోన్న వర్షాల ధాటికి కాలినడక మార్గమే కాకుండా సోన్‌ప్రయాగ్- గౌరీకుండ్ మధ్య ఉండే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. కొండచరియలు విరిగిపడి రాళ్లు గుట్టలుగా పేరుకుపోవడంతో ఇరు ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే స్థానిక షటిల్ సర్వీసులు ఆగిపోయాయి. దీనివల్ల అటు కాలినడకన వెళ్లేవారికి, ఇటు వాహనాలలో వెళ్లే యాత్రికులకు తీవ్ర అంతరాయం కలిగి రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఈ విపత్కర పరిస్థితులలో సహాయక చర్యలు చేపట్టేందుకు స్థానిక జిల్లా పరిపాలన విభాగం, ఉత్తరాఖండ్ పోలీసులు, డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ రంగంలోకి దిగాయి. దెబ్బతిన్న కొండ దారుల వద్ద రక్షణ గోడలను నిర్మించడం, రోడ్డుపై పేరుకుపోయిన బండరాళ్లను తొలగించి మార్గాన్ని అనువుగా మార్చే పనులను అధికారులు చేపట్టారు. వాతావరణం కాస్త అనుకూలించిన వెంటనే నడక దారిని పునర్నిర్మించేందుకు శ్రమిస్తున్నారు. ఈ పరిస్థితిపై రుద్రప్రయాగ జిల్లా విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రజ్వార్ మాట్లాడారు. కేదార్‌నాథ్ యాత్ర పునరుద్ధరణ అనేది పూర్తిగా ఇక్కడి వాతావరణం అనుకూలించడంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. కొండ దారి మొత్తం క్లియర్ అయి, ప్రయాణం సురక్షితంగా ఉందని నిర్ధారించుకున్న తరువాతే అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భక్తులు ఎవరూ ప్రస్తుతం అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని విపత్తు నిర్వహణ బృందాలు విజ్ఞప్తి చేశాయి.

# భారత్ బుల్లెట్ రైలు లేటు వెనుక ? జపాన్ మాజీ మంత్రి షాకింగ్



భారత్ లో ముంబై-అహ్మదాబాద్ మధ్య తొలి బుల్లెట్ రైలు (ఎబశ్రీశ్రీవ్ తీుఅఅ) నడిపేందుకు హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే జపాన్ సహకారంతో చేపడుతున్న ఈ పనులు అనుకున్న విధంగా కాకుండా దారి తప్పుకున్నాయన్న ఆరోపణలు వచ్చాయి. దీని వెనుక ఓ కేంద్రమంత్రితో పాటు పలువురు అధికారులు ఉన్నారంటూ జపాన్ మాజీ మంత్రి ఒకరు చేసిన విమర్శలు కలకలం సృష్టించాయి. దీనిపై కేంద్రం ఇవాళ వివరణ ఇచ్చింది. జపాన్ షింకన్సెన్ హై-స్పీడ్ రైల్వే తరహాలో భారత్ లో నిర్మిస్తున్న బుల్లెట్ రైలు ప్రాజెక్టులో జాప్యానికి మన అధికారులే కారణమని ఆ దేశ మాజీ మంత్రి ఒకరు ఆరోపించారు. రెండు రోజుల క్రితం చేసిన ట్వీట్ లో భారతదేశ ప్రతిష్టాత్మక హై-స్పీడ్ రైలు కారిడార్లో పురోగతి కొరవడిందని జపాన్ మాజీ మంత్రి మకిహారా ఆరోపించారు. ఈ జాప్యానికి పూర్తిగా భారతే కారణమని పేర్కొన్నారు. టోక్యోకు చెందిన ఒక బిజినెస్ న్యూస్ పోర్టల్‌లో, జపాన్‌కు చెందిన సీనియర్ రైల్వే ఇంజనీర్, ఢిల్లీకి చెందిన మెట్రో వాహన కన్సల్టెంట్ అయిన ఇసావో సుజిమురా రాసిన ఒక అభిప్రాయ వ్యాసానికి ప్రతిస్పందనగా మకిహారా ఈ కామెంట్స్ చేశారు. భారతదేశ బుల్లెట్ రైలు ప్రాజెక్టు షింకన్సెన్ నమూనా నుంచి గణనీయంగా పక్కకు మళ్లిందని సుజిమురా ఆరోపించారు. ఈ ఆరోపణలను భారత్ ఇవాళ తోసిపుచ్చింది. బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై చర్చల సందర్భంగా అధికారులు పదేపదే తమ వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని, స్వప్రయోజనాల"కే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపిస్తూ భారత్ పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించిందని జపాన్ మాజీ న్యాయశాఖ మంత్రి హిడెకి మకిహారా చేసిన ఆరోపణల్ని విదేశాంగశాఖ తిరస్కరించింది. అది ఒక వ్యక్తిగత అభిప్రాయం, వాస్తవాలకు గణనీయంగా భిన్నంగా ఉందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ క్లారిటీ ఇచ్చారు. ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైలుపై భారత్-జపాన్ చర్చల్లో పురోగతి ఉందని, జపాన్ జు20 రైలు శ్రేణిని అందిస్తుంది, కానీ అది 2030ల ప్రారంభంలో మాత్రమే అన్నారు. ఈ రైలు అభివృద్ధి దశలో ఉందని జైస్వాల్ స్పష్టం వెల్లడించారు. ఈ మేరకు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు జైస్వాల్ తెలిపారు.

# వెంటనే సాగునీరు విడుదల చేయాలి



- గుడ్డెందొడ్డి, ర్యాలంపాడులో సరిపడా నీళ్లు ఉన్నాయి
- బీఆర్ఎస్ గద్వాల ఇన్‌చార్జి హనుమంతు .. రైతులతో కలిసి రిజర్వాయర్ల పరిశీలన

**గద్వాల, జూలై 17 :** నడిగడ్డలోని పలు రిజర్వాయర్లలో పంటకు సరిపడా ఉన్న నీటిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల, ర్యాలంపాడు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లు, కాల్వలను ఆయకట్టు రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, మహిళా కూలీలు మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రైతులు సంతోషంగా ఉండేవారమని, రేవంత్ ప్రభుత్వంలో వ్యవసాయ రంగం పతనమైందని మండిపడ్డారు. మళ్లా కేసీఆర్ అధికారంలోకి వస్తేనే రైతుల పరిస్థితులు మారుతాయని అన్నారు. అనంతరం హనుమంతు మాట్లాడుతూ.. పలు రిజర్వాయర్లలో నీళ్లున్నా.. విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

# బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు అనుమతి

## యువతకు ఇచ్చిన హామీలు.. ఉద్యోగాల పై చర్చ



బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. బీఆర్ఎస్ అనుబంధ యువజన, విద్యార్థి సంఘాలు ఈ సదస్సు నిర్వహణకు నిర్ణయించారు. తొలుత పోలీసులు ఈ సదస్సుకు అనుమతి నిరాకరించారు. దీంతో.. నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో, తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. రేపు (శనివారం) సరూర్ నగర్ స్టేడియంలో జరిగే ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఎట్టకేలకు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభకు అనుమతి దక్కింది. నిర్వాహకులు అనుమతి కోరుతూ హైకోర్టును ఆశ్రయిం చారు. దీంతో, కొన్ని షరతులు విధిస్తూ కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని..హైవే పైన రాకపోకలకు ఇబ్బంది కలిగించవద్దని స్పష్టం చేసింది. ఈ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 'యూత్ డిక్లరేషన్' హామీలను, ఉద్యోగాల కల్పనలో వారి వైఫల్యాలను నిలదీయడమే లక్ష్యంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ సభ నిర్వహణ కోసం బీఆర్ఎస్ నేతలు జూన్ 30నే పోలీసులకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. శాంతిభద్రతలు కారణంగా చూపుతూ పోలీసులు చివరి నిమిషంలో అనుమతిని నిరాకరించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే సభను అడ్డుకుంటోందని ఆరోపించిన బీఆర్ఎస్ లీగల్ సెల్ హైకోర్టును ఆశ్రయించింది. కాగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లోని హామీల అమలుపై ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ముఖ్యంగా మెగా డీఎస్సీ, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ప్రజలకు వివరించాలని పార్టీ భావిస్తోంది. ప్రత్యేకంగా, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీఆర్ఎస్ సదస్సు నిర్వహిస్తున్న ఇదే సరూర్‌నగర్ స్టేడియంలో ప్రియాంకా గాంధీ సమక్షంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించిన విషయాన్ని బీఆర్ఎస్ నేతలు గుర్తు చేస్తున్నారు. అదే వేదికపై కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే కార్యాచరణను ప్రకటించాలని బీఆర్ఎస్ వ్యూహం సిద్ధం చేసింది. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై నిరుద్యోగ యువతను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. కాగా.. ఈ సదస్సు ద్వారా ప్రభుత్వం చెబుతున్న జాబ్ క్యాలెండర్లు.. ఉద్యోగాల నియామకాల పైన లెక్కలు వెల్లడించాలని బీఆర్ఎస్ డిసైడ్ అయింది.

# అయోధ్య రామాలయంలో 'ప్రాయశ్చిత్త' క్రతువు!

**విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో 10 రోజుల పాటు శుద్ధి పూజలు.. సోమవారం సుప్రీంకోర్టుకు 'సిట్' నివేదిక**

**బలగం టీవీ, అయోధ్య,**

అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన ఈ వ్యవహారంతో ఆలయ పవిత్రత దెబ్బతిన్నందున.. భగవంతుడికి క్షమాపణలు కోరుతూ 10 రోజుల ప్రత్యేక ప్రాయశ్చిత్త, శుద్ధి పూజలను ప్రారంభించింది. ఒకవైపు ఆలయంలో ఆధ్యాత్మికంగా శుద్ధి క్రతువులు సాగుతుండగానే.. మరోవైపు ఈ అవినీతి ఆరోపణలపై దర్యాప్తు జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) సోమవారం సుప్రీంకోర్టుకు తన మధ్యంతర నివేదికను సమర్పించనుంది.



251 సార్లు విష్ణు సహస్రనామ పారాయణం ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి సంకల్పంతో బుధవారం ఈ ప్రత్యేక శుద్ధి క్రతువు ప్రారంభమైంది. ఇందులో భాగంగా అయోధ్యలోని వివిధ గురుకులాలకు చెందిన వేద విద్యార్థులు ప్రతిరోజూ విష్ణు సహస్రనామ స్తోత్రాన్ని కనీసం 251 సార్లు పారాయణం చేస్తున్నారు. హిందూ ధర్మ విశ్వాసాల ప్రకారం సమాజంలో సానుకూలతను పెంచి, అష్టైశ్వర్యాలను ప్రసాదించే శ్రీమహావిష్ణువు వెయ్యి నామాల జపంతో పాటు వాల్మీకి రామాయణ పారాయణాన్ని కూడా ఇక్కడ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా గోవింద్ దేవ్ గిరి మాట్లాడుతూ.. "విరాళాల దుర్వినియోగం కారణంగా ఆలయ పవిత్రత, గౌరవం దెబ్బతిన్నాయి. వాటిని పునరుద్ధరించేందుకే ఈ ప్రాయశ్చిత్త కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ వ్యవహారం భక్తులను తీవ్రంగా బాధించింది, అయితే నిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయి" అని ఆశాభావం వ్యక్తం చేశారు. రామ్‌లల్లా ఆలయంలో జరిగిన పొరపాట్లకు ప్రాయశ్చిత్తంగానే ఈ పారాయణాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యుడు దినేంద్ర దాస్ పేర్కొన్నారు.

సుప్రీంకోర్టుకు 'సిట్' మధ్యంతర నివేదిక మరోవైపు, ఈ నిధుల దుర్వినియోగంపై దర్యాప్తును సుప్రీంకోర్టు నిశితంగా పరిశీలిస్తోంది. ఆలయ నిధులపై స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని ధర్మాసనం ఆదేశించిన నేపథ్యంలో.. ముగ్గురు సభ్యుల 'సిట్' కమిటీ సోమవారం అత్యున్నత న్యాయస్థానానికి మధ్యంతర నివేదికను సమర్పించనుంది. లఖ్‌నవూ డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, ఐజీ కిరణ్ ఎస్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి నీల్ రతన్‌లతో కూడిన ఈ కమిటీ ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది.

22న ట్రస్ట్ కీలక సమావేశం రాబోయే ఫైనల్ రిపోర్టులో ఆలయ పరిపాలన, విరాళాల లెక్కింపు వ్యవస్థలో పారదర్శకత కోసం సిట్ కొన్ని కీలక సంస్కరణలను సిఫార్సు చేయనున్నట్లు సమాచారం. ఈ సిఫార్సులపై జులై 22న అయోధ్యలో జరగబోయే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సర్వసభ్య సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నారు.

# హాస్టళ్లు, పీజీల్లో మహిళల భద్రతకు పోలీస్ 'భరోసా'!

**'ప్రాజెక్ట్ సేఫ్ స్టే'కి శ్రీకారం చుట్టిన పోలీస్, జీహెచ్ఎంసీ.. వసతి గృహాల నమోదు ఇక తప్పనిసరి**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం నగరానికి వచ్చే మహిళలు, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ కీలక అడుగు వేసింది. వసతి గృహాల్లో వారికి మరింత సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (HCSC), యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థలతో కలిసి సంయుక్తంగా 'ప్రాజెక్ట్ సేఫ్ స్టే' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూపొందించిన 'సురక్ష నివాస్ 1.0' మార్గదర్శకాల బ్రోచర్‌ను బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో శుక్రవారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సంయుక్తంగా ఆవిష్కరించారు. అనంతరం హాస్టళ్లు, పీజీల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు పాల్గొని దిశా నిర్దేశం చేశారు.



పోలీస్ స్టేషన్‌లో నమోదు తప్పనిసరి: సీపీ సజ్జనర్ ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. నగర పరిధిలోని ప్రతి మహిళా హాస్టల్, పీజీ నిర్వాహకులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. నూతనంగా అమల్లోకి తెచ్చిన 'రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్' కింద నిర్దేశిత ఫామ్-ఏ ను పూర్తి చేసి స్థానిక పోలీసులకు సమర్పించాలన్నారు. వసతి గృహాల్లో భద్రతా ప్రమాణాలపై తాము 10 ప్రత్యేక బృందాలతో నగర పరిధిలోని 447 మహిళా హాస్టళ్లలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించగా కొన్ని ఆందోళనకర లోపాలు వెలుగు చూశాయని తెలిపారు. దాదాపు 97.5 శాతం హాస్టళ్లలో సీసీటీవీ కెమెరాలు ఉన్నప్పటికీ, కేవలం 43 శాతం వసతి గృహాలకు మాత్రమే సరైన కాంపౌండ్ వాల్స్ ఉన్నాయని, అత్యంత కీలకమైన అగ్నిమాపక పరికరాలు కేవలం 38.9 శాతం హాస్టళ్లలోనే అందుబాటులో ఉన్నాయని సీపీ వెల్లడించారు.

ఈ నిబంధనలు యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడానికి కాదని, కనీస భద్రతా ప్రమాణాలను నెలకొల్పి మహిళలకు జవాబుదారీతనంతో కూడిన రక్షణ కల్పించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. త్వరలోనే మహిళా భద్రతకై ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని సీపీ ప్రకటించారు.

హాస్టల్ నిర్వహణ వ్యాపారమే.. లైసెన్స్ ఉండాల్సిందే: జీహెచ్ఎంసీ కమిషనర్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ... నివాస ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు అపార్ట్‌మెంట్‌లను అద్దెకు ఇవ్వడం వ్యక్తిగత అద్దె (టెనెన్సీ) పరిధిలోకి వస్తుందని, కానీ పెద్ద ఎత్తున భవనాలను సమూహంగా తీసుకుని హాస్టల్ రూపంలో నడపడం కచ్చితంగా 'వ్యాపారం' (ట్రేడ్) కిందికే వస్తుందని తేల్చిచెప్పారు. కాబట్టి నిర్వాహకులందరూ వెంటనే మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. అలాగే భోజనం, వసతి కల్పించే వారు చట్టప్రకారం కచ్చితంగా 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' (FSSAI) లైసెన్స్ కలిగి ఉండాలని, లేనిపక్షంలో వాటిని అనధికారిక వసతి గృహాలుగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టల్‌కు వచ్చే, వెళ్లే వారి పూర్తి వివరాలతో కూడిన పక్కా రిజిస్ట్రేషన్ల నిర్వహణతో పాటు, అక్కడ పనిచేసే సిబ్బందికి కచ్చితంగా సెక్యూరిటీ చెకప్ నిర్వహించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు.

**అగ్నిమాపక, ఆహార నాణ్యత నిబంధనలు ఇవే:**

రెండవ మెట్ల మార్గం తప్పనిసరి: భవనం ఎన్ని అంతస్తులు ఉన్నప్పటికీ అత్యవసర సమయాల్లో నివాసితులు సురక్షితంగా బయటపడటానికి కచ్చితంగా రెండవ మెట్ల మార్గం ఉండాలని హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. ప్రతి అంతస్తులోనూ కనీసం రెండు కేజీల సామర్థ్యం గల ఫైర్ ఎక్స్‌టింగిషర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఆహార నాణ్యతపై క్రిమినల్ కేసులు: వంటగది పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడితే 'అన్‌సేఫ్, సబ్‌స్టాండర్డ్' కేటగిరీల కింద క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పి. మూర్తి హెచ్చరించారు.

బ్రాండ్ వాల్యూ పెరుగుతుంది: హాస్టళ్ల నిర్వహణ వ్యాపారం కాదని, ఒక బాధ్యతాయుతమైన సేవ అని హెచ్‌సీఎస్సీ సెక్రటరీ జనరల్ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆన్‌లైన్ సేఫ్టీ రేటింగ్స్ సాధించడం ద్వారా నిర్వాహకుల క్రెడిబిలిటీ పెరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ పి.ఉదయ్ కుమార్ (IAS), అదనపు సీపీలు శ్రీనివాసులు (IPS), తఫ్సీర్ ఇక్బాల్ (IPS), డీసీపీలు రక్షిత కృష్ణమూర్తి (IPS), శిల్పవల్లి (IPS), చైతన్యకుమార్ (IPS), జాయింట్ సెక్రటరీ ఖ్యాతి నరవణే తదితరులు పాల్గొన్నారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

**- ఇద్దరు మృతి**

**బలగం టీవీ, హైదరాబాద్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర అవుటర్ రింగు రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. కీసర సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన కటిక రషీద్(40) తమ గ్రామానికి చెందిన డ్రైవర్ రాములు(60), గౌస్ ను వెంట పెట్టుకుని బొలెరో వాహనంలో గొర్రెల లోడుతో చెంగిచెర్లకు వెళ్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో వారికి నిద్ర రావడంతో కీసర ఓఆర్ఆర్ పై రాంపల్లిదాయర వద్ద తమ వాహనాన్ని ఎడమ వైపు నిలిపి నిద్రిస్తున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం వెనకాల నుంచి వచ్చి బొలెరో వాహనాన్ని ఢీ కొట్టి, ఆగ కుండా వెళ్లిపోయింది. దాంతో వాహనంలో నిద్రిస్తున్న రషీద్, రాములుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. వీరితో పాటు ఉన్న గౌస్ కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కొన్ని గొర్రెలు మృతి చెందాయి. మృతుడు రషీద్ కు భార్య, ఓ కొడుకు, కూతురు ఉన్నారు. ఇద్దరూ ఇంజినీరింగ్ చదువుతున్నారు. నార్సింగ్ లో మటన్ దుకాణం పెట్టి వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాములుకు భార్య, ఇద్దరు కూతుర్లు ఉండగా వారి వివాహాలు అయ్యాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

## కిక్కిరిసిన తిరుమల.. శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటల నిరీక్షణ

**బలగం టీవీ, హైదరాబాద్**

కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వర స్వామి దేవాలయం దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తిరుమల గిరులకు పోటెత్తారు. వారాంతానికి ముందే భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 24 నుంచి 30 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానాలు అధికారులు తెలిపారు.భక్తుల తాకిడి కారణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూలైన్లు బయట వరకు విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు బారులు తీరుతూ గంటల తరబడి దర్శనం కోసం నిరీక్షిస్తున్నారు.

రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులు తమ యాత్రను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ అధికారులు సూచించారు.

ఇదిలా ఉండగా, గురువారం ఒక్కరోజే 63,556 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వారిలో 35,900 మంది తలనీలాలు సమర్పించారు. భక్తుల కానుకల ద్వారా రూ.5.31 కోట్ల హుండీ ఆదాయం లభించింది. అలాగే 4.12 లక్షల లడ్డూలు విక్రయించగా, 2.55 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. మరో 4,051 మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు టీటీడీ వెల్లడించింది.

## తల్లితో బావిలో దూకిన ఇద్దరు పిల్లలు..

**బలగం టీవీ, హైదరాబాద్**

భర్త నిత్యం మద్యం మత్తులో వేధింపులకు గురిచేస్తుండటంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి వ్యవసాయ బావిలో దూకిన విషాద ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో తల్లి, కుమార్తె మృతిచెందగా, కుమారుడు బావిలోని చెట్టు కొమ్మను పట్టుకుని సుమారు అరగంట పాటు ప్రాణాలతో పోరాడి చివరకు సురక్షితంగా బయటపడ్డాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా యలాల్ మండలానికి చెందిన ఊరుబాటి సుధాకర్, భార్య వసంత (35), కుమార్తె నవ్య (15), కుమారుడు వేణుతో కలిసి పదేళ్ల క్రితం శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి వలస వచ్చి ఓ తోటలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సుధాకర్‌కు మద్యపాన అలవాటు ఉండటంతో ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడుతూ శారీరక, మానసిక వేధింపులకు గురిచేసేవాడని తెలిసింది.గురువారం రాత్రి కూడా ఇదే తరహా గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసంత.. పిల్లలను తీసుకుని అర్ధరాత్రి సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ముగ్గురూ కలిసి బావిలోకి దూకారు. అయితే బావిలో పడుతున్న సమయంలో బాలుడు వేణు చేతికి లోపలికి వంగి ఉన్న చెట్టు కొమ్మ తగలడంతో దానిని గట్టిగా పట్టుకుని ప్రాణాలను కాపాడుకున్నాడు.ఇంట్లో భార్య, పిల్లలు కనిపించకపోవడంతో వారిని వెతుక్కుంటూ వచ్చిన సుధాకర్‌కు బావి వద్ద నుంచి కుమారుడి అరుపులు వినిపించాయి. వెంటనే బావిలోకి దిగి వేణును సురక్షితంగా బయటకు తీసుకొచ్చాడు. అయితే అప్పటికే వసంత, నవ్య నీటిలో మునిగి మృతిచెందారు.సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించండి...



**బలగం టీవీ, రుద్రంగి:**

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో రుద్రంగి పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రంగి ఎస్సై మోతిరాం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తూ, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై మోతిరాం మాట్లాడుతూ, ప్రాణాలను కాపాడుకోవడానికి ట్రాఫిక్ నిబంధనలే రక్షణ కవచమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, ఇన్సూరెన్స్ లేని వాహనాలను ఉపయోగించడం మోటారు వాహనాల చట్టం ప్రకారం నేరమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలతో పాటు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ ఉపయోగించడం వంటి నిర్లక్ష్య చర్యలే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని అన్నారు.

ఒక్క క్షణం నిర్లక్ష్యం జీవితాంతం బాధను మిగులుస్తుందని, ప్రతి వాహనదారుడు తన కుటుంబాన్ని గుర్తు పెట్టుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించే వారికే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని, ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎస్సై మోతిరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలికతో అసభ్య ప్రవర్తన.. దేహశుద్ధి అనంతరం వ్యక్తి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ కుల్సుంపుర పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడనే ఆరోపణలతో స్థానికుల దాడికి గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల వివరాల ప్రకారం.. జియాగూడ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నివసించే అబ్దుల్ అజీజ్ నిలోఫర్ ఆస్పత్రి సమీపంలో టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే కాలనీలో నివసించే నాలుగో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలికతో అతడు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు సమాచారం.

విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహంతో అబ్దుల్ అజీజ్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు.

ఈ ఘటనపై కుల్సుంపుర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మరోవైపు, అబ్దుల్ అజీజ్ మృతికి ఉస్మానియా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని అతని బంధువులు ఆరోపించారు. సకాలంలో సరైన చికిత్స అందించకపోవడం వల్లే మృతి సంభవించిందని పేర్కొంటూ ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై ఎస్పీకి ఫిర్యాదు...

**బలగం టీవీ, సిరిసిల్ల:**

తనపై సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ శజిందం కళా చక్రపాణి శుక్రవారం జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతేకు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా కళా చక్రపాణి మాట్లాడుతూ, మిట్టపల్లి శ్రీకాంత్ అనే వ్యక్తి ఏఐ (AI) సాంకేతికతను ఉపయోగించి తప్పుడు ఫోటోలు, వీడియోలు రూపొందించి, వాటిని సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం చేస్తూ తన వ్యక్తిగత గౌరవం, సామాజిక ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.మున్సిపల్ పాలకవర్గం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ప్రజల చేత రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులపై వ్యతిరేకత సృష్టించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. మహిళా ప్రజాప్రతినిధిగా తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వ్యవహరించడమే కాకుండా, మున్సిపల్ పరిపాలనతో సంబంధం లేని తన భర్త జిందం చక్రపాణిని కూడా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రచారంలోకి లాగుతున్నారని ఆరోపించారు.

భవిష్యత్తులో ఎవరూ సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తూ తప్పుడు ప్రచారాలు, సైబర్ బెదిరింపులకు పాల్పడకుండా సంబంధిత వ్యక్తిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా, బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి కూడా తనకు సంబంధం లేని విషయాల్లో తన పేరును ఉపయోగిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొంటూ, సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ప్రత్యేకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ...

**బలగం టీవీ, రుద్రంగి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామానికి చెందిన గూగులోత్ ప్రమీలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.60 వేల ఆర్థిక సహాయ చెక్కును తెలంగాణ రాష్ట్ర సహకార కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి గురువారం అందజేశారు.

ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద, నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) గొప్ప భరోసాగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తోందని, అవసరమైన సమయంలో ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉప సర్పంచ్ దాసరి అశోక్, జిల్లా జనరల్ సెక్రటరీ తుమ్ జలపతి, జిల్లా కార్యదర్శి జక్కు మోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్ రెడ్డి, జక్కు లింగారెడ్డి, అల్లూరి తిరుపతి, పండుగ గంగాధర్, తుమ్ రమేష్, కొండ రాజేందర్, తునికి రమేష్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సిరిసిల్లలో టీఆర్ఎస్ సంబరాలు...

**బలగం టీవీ, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మజీద్ నియామకాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీఆర్ఎస్ జెండా సమీపంలో బాణాసంచా కాల్చి, మజీద్‌ను పూలదండలు, శాలువాలతో సన్మానించి మిఠాయిలు పంచుతూ ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 23 శాసనసభ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించడం ద్వారా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని అన్నారు. ఇన్‌చార్జ్ పదవుల్లో 50 శాతం బీసీలకు, మిగిలిన 50 శాతం ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు కేటాయించడం ద్వారా సమాన అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. పార్టీ ప్రకటించిన ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి–ఉద్యోగాలు, రైతే రాజు, సామాజిక న్యాయం అనే ఐదు ప్రధాన లక్ష్యాలతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. మహిళా సాధికారత కోసం ఎంపీగా ఉన్న సమయంలో కవిత పార్లమెంట్‌లో పోరాటం చేశారని, అలాగే తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ పండుగకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు.

రాష్ట్ర మహిళలు, యువత కవితను మహిళా ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని పేర్కొన్న మజీద్, తనపై నమ్మకం ఉంచి సిరిసిల్ల నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజలంతా టీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కదిరే భాస్కర్ గౌడ్, సయ్యద్ జావిద్, మార్వాడి దేవరాజు, రాకేష్, శ్రీహరి, భూపతి, లాల్ మహ్మద్, సతీష్ రావు, బాబు, దేవరాజు, తోట కనకయ్య, నవీన్, లక్ష్మణ్, బిక్షపతి, రమేష్, మదన్ లాల్, రఘుపతి, ప్రవీణ్, లింగం, గంగారం, శైలజ, సంధ్య, రేణుక, లాస్య, పద్మలతో పాటు సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## విండీస్ లెజెండ్ సర్ గ్యారీ సోబర్స్ కన్నుమూత!

### 89 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచిన మేటి ఆల్‌రౌండర్.. సంతాపం ప్రకటించిన ఐసీసీ, క్రికెట్ వెస్టిండీస్

**బలగం టీవీ, బార్బడోస్**

క్రికెట్ ప్రపంచంలో ఒక సుదీర్ఘమైన, అద్భుతమైన ఇన్నింగ్స్ ముగిసింది. వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం, ప్రపంచ అత్యుత్తమ ఆల్‌రౌండర్ సర్ గార్ఫీల్డ్ (గ్యారీ) సోబర్స్ (89) శుక్రవారం కన్నుమూశారు. బార్బడోస్‌లోని తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 'గాడ్ గిఫ్టెడ్ క్రికెటర్'గా ప్రశంసలు అందుకున్న సోబర్స్ మృతి పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

16 ఏళ్లకే ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఎంట్రీ క్రికెట్ చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న గ్యారీ సోబర్స్.. కేవలం 16 ఏళ్ల ప్రాయంలోనే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టారు. ఆ తర్వాతి ఏడాదికే ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ టెస్ట్ జట్టులోకి అరంగేట్రం చేశారు. కెరీర్ ప్రారంభంలో స్పిన్, పేస్ వేయగల బౌలర్‌గానే జట్టులో గుర్తింపు పొందిన సోబర్స్.. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ తన విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా పాకిస్థాన్‌పై ఆయన సాధించిన 365 పరుగుల అజేయ ట్రిపుల్ సెంచరీతో రాత్రికి రాత్రే ప్రపంచ స్టార్ బ్యాటర్‌గా అవతరించారు.

ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు.. సుమారు రెండు దశాబ్దాల పాటు సాగిన తన అంతర్జాతీయ కెరీర్‌లో సోబర్స్ తిరుగులేని రికార్డులను సృష్టించారు. 20 ఏళ్ల కెరీర్‌లో 8,000కు పైగా పరుగులు సాధించడమే కాకుండా బౌలింగ్‌లోనూ రాణిస్తూ 235 వికెట్లు పడగొట్టారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఒకే ఓవర్‌లో ఆరు బంతులకు ఆరు సిక్సర్లు బాదిన ప్రపంచపు మొట్టమొదటి బ్యాటర్‌గా ఆయన చరిత్ర సృష్టించారు. అంతర్జాతీయ క్రికెట్‌కు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా.. ఐసీసీ ఏటా ఇచ్చే అత్యుత్తమ పురుషుల క్రికెటర్ అవార్డును 'ది సర్ గ్యారీ సోబర్స్ అవార్డు' పేరుతో అందజేస్తోంది. ఎప్పటికీ మా హృదయాల్లోనే ఉంటారు: వెస్టిండీస్ బోర్డు సోబర్స్ మృతిపై క్రికెట్ వెస్టిండీస్ భావోద్వేగ ట్వీట్ చేసింది. "ఒక గొప్ప ఇన్నింగ్స్ ముగిసింది. ఇప్పుడే కాదు, ఎప్పటికీ మీరు మా హృదయాల్లోనే ఉండిపోతారు సర్ గ్యారీ" అంటూ బోర్డు నివాళులర్పించింది. ఆయన మరణం వెస్టిండీస్ క్రికెట్‌కే కాకుండా, యావత్ ప్రపంచ క్రీడారంగానికి తీరని లోటని క్రీడా విశ్లేషకులు కొనియాడారు.



## డోపింగ్ వివాదంలో పాక్ క్రికెటర్.. మొహమ్మద్ నవాజ్‌పై ఐసీసీ నిషేధం!

### టీ20 వరల్డ్‌కప్‌లో నిబంధనల ఉల్లంఘన.. చికిత్సకు అంగీకరించడంతో తగ్గిన సస్పెన్షన్ వేటు

**బలగం టీవీ, దుబాయ్**

పాకిస్థాన్ సీనియర్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ నవాజ్ డోపింగ్ ఉచ్చులో చిక్కుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిషేధిత డ్రగ్స్ జాబితాలో ఉన్న ఉత్ప్రేరకాన్ని తీసుకున్నందుకు గానూ అతనిపై మూడు నెలల పాటు నిషేధం పడింది. భారత్, శ్రీలంక వేదికగా ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో నవాజ్ డోపింగ్ నిరోధక నియమాలను ఉల్లంఘించినట్లు ఐసీసీ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే, తన పొరపాటును అంగీకరించి పునరావాస కేంద్రంలో చికిత్స పొందేందుకు నవాజ్ అంగీకరించడంతో.. అతని సస్పెన్షన్ కాలాన్ని ఐసీసీ ఒక నెలకి కుదించింది.

**రక్త నమూనాల్లో దొరికిన 'కార్బాక్సీ-టీహెచ్‌సీ'**

వరల్డ్‌కప్ టోర్నీలో భాగంగా ఫిబ్రవరి 7న కొలంబో వేదికగా నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్ అనంతరం నవాజ్‌కు డ్రగ్స్ నిరోధక సంస్థ పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో అతని రక్త నమూనాల్లో ఐసీసీ నిషేధించిన 'కార్బాక్సీ-టీహెచ్‌సీ' (Carboxy-THC) అనే డ్రగ్ ఉన్నట్లు తేలింది. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన ఐసీసీ క్రమశిక్షణా కమిటీ.. నిబంధనల ప్రకారం మూడు నెలల నిషేధాన్ని ఖరారు చేసింది. మే 1వ తేదీ నుంచే ఈ నిషేధం అమలులోకి వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఐసీసీ విచారణలో నవాజ్ తన తప్పును ఒప్పుకున్నాడు. అయితే తాను ఆటలో శక్తి సామర్థ్యాలు పెంచుకోవడానికి (పర్ఫార్మెన్స్ ఎన్‌హాన్సింగ్) ఈ డ్రగ్ తీసుకోలేదని స్పష్టం చేశాడు. ఈ క్రమంలోనే డ్రగ్స్ అలవాటు నుంచి బయటపడేందుకు ఐసీసీ గుర్తింపు పొందిన పునరావాస కేంద్రంలో చికిత్స (రిహాబిలిటేషన్) తీసుకునేందుకు సమ్మతించాడు. దీంతో మానవతా దృక్పథంతో స్పందించిన ఐసీసీ.. శిక్షా కాలాన్ని మూడు నెలల నుండి ఒక నెలకు తగ్గించింది. ఇప్పటికే నవాజ్ రెండున్నర నెలలుగా సస్పెన్షన్‌లో ఉండటంతో, నిబంధనల ప్రకారం పునరావాస ప్రక్రియ పూర్తి కాగానే అతనిపై ఉన్న నిషేధాన్ని అధికారికంగా ఎత్తివేయనున్నారు.

నవాజ్ డోపింగ్ పరీక్షలో విఫలం కావడంతో ఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌తో పాటు ఆ తర్వాత మే 1వ తేదీ వరకు నవాజ్ ఆడిన అన్ని మ్యాచ్‌ల ప్రదర్శనను (అతను చేసిన పరుగులు, తీసిన వికెట్లు) రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు (డిస్‌క్వాలిఫై) ఐసీసీ స్పష్టం చేసింది.

## రోహిత్ రిటైర్మెంట్ వార్తలు అవాస్తవం

### బీసీసీఐ స్పష్టత! లార్డ్స్ వన్డేనే ఆఖరి మ్యాచ్ అనడంపై బోర్డు ఆగ్రహం.. ప్రచారాన్ని ఖండించిన కార్యదర్శి దేవాజిత్ సైకియా

**బలగం టీవీ, లండన్**



భారత వన్డే జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ వన్డే రిటైర్మెంట్‌పై గత కొన్ని గంటలుగా సాగుతున్న ఊహాగానాలకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తెరదించింది. ఆదివారం ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరగనున్న మూడో వన్డేనే రోహిత్‌కు ఆఖరి మ్యాచ్ అంటూ వస్తున్న వార్తలను బీసీసీఐ తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, లార్డ్స్ వన్డే తర్వాత కూడా రోహిత్ శర్మ వన్డే జట్టు కెప్టెన్‌గా కొనసాగుతారని బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా అధికారికంగా స్పష్టం చేశారు.

ఆ వార్తల్లో నిజం లేదు.. జాతీయ వార్తా సంస్థ 'పీటీఐ' (PTI)తో దేవాజిత్ సైకియా శుక్రవారం రాత్రి మాట్లాడుతూ.. రోహిత్ భవిష్యత్తుపై మీడియాలో వస్తున్న కథనాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "రోహిత్ శర్మ వన్డే కెరీర్‌పై మీడియాలో అనేక ఊహాగానాలు నడుస్తున్నాయి. వాటన్నింటినీ నేను పూర్తిగా తోసిపుచ్చుతున్నాను. ఆదివారం లార్డ్స్‌లో రోహిత్ తన కెరీర్‌లో ఆఖరి వన్డే ఆడబోతున్నాడనే చర్చ బోర్డులో ఎప్పుడూ జరగలేదు. ఆ వార్తలన్నీ పూర్తిగా నిరాధారమైనవి" అని ఆయన కుండబద్దలు కొట్టారు.

2027 వరల్డ్‌కప్‌పై దాటవేత 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సెలక్షన్ కమిటీ యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు, అందువల్లనే 39 ఏళ్ల రోహిత్‌ను పక్కన పెడుతున్నట్లు కథనాలు వచ్చాయి. ఈ సిరీస్‌లోని మొదటి రెండు వన్డేల్లో రోహిత్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో ఈ పుకార్లు మరింత ఎక్కువయ్యాయి.అయితే, లార్డ్స్ వన్డే రోహిత్ ఆఖరి మ్యాచ్ కాదని స్పష్టం చేసిన సైకియా.. 2027 వరల్డ్‌కప్ వరకు అతను జట్టులో ఉంటాడా లేదా అనే విషయంపై మాత్రం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. "రోహిత్ ప్రస్తుతం భారత వన్డే జట్టులో రెగ్యులర్ సభ్యుడు. బోర్డు ప్రణాళికల్లో ఉన్నంత కాలం అతను దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూనే ఉంటాడు" అని సైకియా వ్యాఖ్యానించారు.

ఆదివారం సిరీస్ ఫైనల్ సమరం ఎడ్జ్‌బాస్టన్, కార్డిఫ్‌లలో జరిగిన మొదటి రెండు వన్డేల అనంతరం భారత్-ఇంగ్లాండ్ సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉంది. జూలై 19 (ఆదివారం) లార్డ్స్ మైదానంలో జరగబోయే కీలకమైన మూడో వన్డేలో రోహిత్ శర్మ సారథ్యంలోనే టీమిండియా బరిలోకి దిగనుంది. బోర్డు ఇచ్చిన అధికారిక వివరణతో అభిమానుల్లో ఉన్న సస్పెన్స్‌కు తెరపడటమే కాకుండా, జట్టుపై ఉన్న ఒత్తిడి కూడా తగ్గినట్లయింది.

## మూడో వన్డేకు ముందు టీమిండియాకు బిగ్ షాక్!

### గాయంతో సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌కు వాషింగ్టన్ సుందర్ దూరం.. రేపే లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో కీలక పోరు

**బలగం టీవీ, లండన్**



ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌కు ముందు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా ఆదివారం లార్డ్స్ వేదికగా జరగనున్న మూడో, చివరి వన్డేకు పూర్తిగా దూరమయ్యాడు. గురువారం కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో బ్యాటింగ్ చేస్తుండగా సుందర్ కాలి కండరాలు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రస్తుతం ఇరు జట్లు 1-1తో సిరీస్‌లో సమంగా ఉండటంతో రేపు జరగబోయే మ్యాచ్ ఉత్కంఠ రేపుతోంది.

తొడ కండరాల గాయంతో తీవ్ర అసౌకర్యం రెండో వన్డేలో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో మొదటి పరుగు కోసం మిడ్-ఆఫ్ వైపు దూసుకెళ్లే క్రమంలో వాషింగ్టన్ సుందర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో అతను 5 బంతుల్లో 2 పరుగులు మాత్రమే చేసినప్పటికీ.. మైదానంలో తీవ్రమైన నొప్పితో కనిపించాడు. ఇన్నింగ్స్ విరామ సమయంలో టీమిండియా ఫిజియో అతని తొడ భాగానికి బ్యాండేజ్ కడుతూ కనిపించారు. అనంతరం సుందర్ తీవ్ర అసౌకర్యంతోనే స్టేడియం వీడాడు. గాయం తీవ్రత కారణంగా భారత్ బౌలింగ్ సమయంలో అతను ఫీల్డింగ్‌కు కూడా రాలేకపోయాడు.

ఈ విషయమై జట్టు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పందిస్తూ.. "సుందర్ కండరాల గాయం చాలా తీవ్రంగా ఉన్నట్లు కనిపిస్తోంది. రన్ తీసే క్రమంలోనే అతను గాయపడ్డాడు, ఆ తర్వాతి బంతికే అవుటయ్యాడు" అని వెల్లడించారు.

తుది జట్టు ఎంపికపై కోచ్ గంభీర్ కసరత్తు తొలి వన్డేలో సిక్సర్‌తో హాఫ్ సెంచరీ బాది జట్టును విజయతీరాలకు చేర్చిన సుందర్.. ఇప్పుడు మూడు ఫార్మాట్లలోనూ టీమిండియాకు కీలక ఆటగాడిగా మారాడు. అయితే జట్టులోని ఇతర ఆల్‌రౌండర్లు నితీష్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్యా ఇప్పటికే గాయాలతో దూరం కాగా.. ఇప్పుడు సుందర్ కూడా అందుబాటులో లేకపోవడం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలకు సవాల్‌గా మారింది. సుందర్ స్థానాన్ని భర్తీ చేసే సరైన ఆల్‌రౌండర్ ప్రత్యామ్నాయం ప్రస్తుతం జట్టులో కనిపించడం లేదు.

రేపటి రేసులో కుల్దీప్ యాదవ్? వాషింగ్టన్ సుందర్ లేని లోటును భర్తీ చేసేందుకు లార్డ్స్ వన్డేలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఐపీఎల్ 2026లో పేలవ ప్రదర్శన అనంతరం కుల్దీప్‌కు అంతర్జాతీయ మ్యాచ్‌లలో పెద్దగా అవకాశాలు దక్కలేదు. గత 13 మ్యాచ్‌లలో అతను కేవలం ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. ఒకవేళ అనారోగ్యం నుంచి కోలుకుని కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ సాధిస్తే.. ఇషాన్ కిషన్, రాహుల్ ఇద్దరినీ కలిపి ఆడించి బౌలింగ్ విభాగాన్ని సమతుల్యం చేయాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అలా కాని పక్షంలో కుల్దీప్ యాదవ్ ఒక్కడే జట్టుకు ఏకైక మార్గంగా మారనున్నాడు.

## ఫిఫా వరల్డ్‌కప్ విజేతలకు 'మహా' కానుక!

### ప్రపంచకప్ చరిత్రలోనే తొలిసారిగా 'ఛాంపియన్‌షిప్ రింగ్స్'.. ఎన్‌బీఏ తరహాలో సరికొత్త ఒరవడి

**బలగం టీవీ, న్యూయార్క్**



ఫిఫా ప్రపంచకప్-2026 ఫైనల్ పోరుకు కౌంట్‌డౌన్ ప్రారంభమైన వేళ.. ఫుట్‌బాల్ అభిమానులకు, ఆటగాళ్లకు అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ఒక అదిరిపోయే తీపి కబురు అందించింది. అమెరికా, మెక్సికో, కెనడాల సంయుక్త ఆతిథ్యంలో జరుగుతున్న ఈ మెగా టోర్నీ విజేతలకు జీవితాంతం గుర్తుండిపోయేలా.. ప్రపంచకప్ చరిత్రలోనే తొలిసారిగా 'ఛాంపియన్‌షిప్ రింగ్స్' (ఉంగరాలు) బహూకరించాలని ఫిఫా నిర్ణయించింది. అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక బాస్కెట్‌బాల్ లీగ్ 'ఎన్‌బీఏ' (NBA)లో విజేతలకు ఉంగరాలు ఇచ్చే సాంప్రదాయాన్ని ఇప్పుడు ఫిఫా ఫుట్‌బాల్‌లోకి తీసుకువస్తుండటం విశేషం.

రెండు రోజుల్లో ఫైనల్స్.. స్పెయిన్, అర్జెంటీనా సై ప్రపంచకప్ సమరంలో మరికొద్ది గంటల్లోనే అసలైన సింహగర్జన వినిపించనుంది. సెమీఫైనల్స్‌లో అద్భుత ప్రదర్శనతో దూసుకొచ్చిన స్పెయిన్, అర్జెంటీనా జట్లు టైటిల్ పోరుకు సిద్ధమయ్యాయి. న్యూయార్క్‌లోని న్యూజెర్సీ స్టేడియంలో ఆదివారం (జూలై 19) జరిగే ఫైనల్ పోరులో గెలిచిన జట్టుకు ప్రపంచకప్ ట్రోఫీ, బంగారు పతకాలతో పాటు ఈ ప్రతిష్ఠాత్మక ఛాంపియన్‌షిప్ ఉంగరాలు కూడా దక్కనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచి చరిత్ర సృష్టించే జట్టుకే ఫుట్‌బాల్ చరిత్రలో ఈ రింగ్స్ అందుకున్న తొలి జట్టుగా రికార్డు సొంతం కానుంది.

2026 ప్రత్యేక ఉంగరాలు.. అభిమానులకూ అవకాశం! ఈ ఏడాది 2026 ఎడిషన్ కావడం వల్ల.. ఫిఫా సరిగ్గా 2026 ఉంగరాలను ప్రత్యేకంగా తయారు చేయిస్తోంది. వీటిలో 30 ఉంగరాలను విజేతగా నిలిచిన జట్టు సభ్యులకు బహూకరిస్తారు. మిగిలిన 1,996 ఉంగరాలను గుర్తింపు పొందిన సంస్థల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులకు విక్రయించనున్నారు.

ఉంగరం ప్రత్యేకతలివే:

రూపకల్పన: ఈ ఉంగరానికి ఒకవైపు ఫిఫా వరల్డ్‌కప్ ట్రోఫీ చిహ్నం, మరోవైపు విజేతగా నిలిచిన దేశం యొక్క జాతీయ చిహ్నాన్ని ముద్రిస్తారు.

కస్టమైజేషన్: ప్రతి ఉంగరానికి ఒక ప్రత్యేకమైన వ్యక్తిగత సంఖ్య (సిరియల్ నంబర్) ఉంటుంది.

అధికారిక ప్రదానం: ఆదివారం ఫైనల్ ముగిసిన వెంటనే వేడుకల్లో భాగంగా విన్నింగ్ టీమ్ కెప్టెన్, కోచ్‌కు తాత్కాలిక ఉంగరాలను అందిస్తారు. ఆ తర్వాత ఆటగాళ్లు, సిబ్బంది వేళ్ల కొలతలకు అనుగుణంగా (కస్టమైజ్ చేసి) ప్రత్యేకంగా రూపొందించిన ఉంగరాలను ఫిఫా అధికారికంగా అందజేస్తుంది.

## కోహ్లీ-గంభీర్ పదిసార్లు మాట్లాడుకున్నారు..

### పుకార్లను నమ్మొద్దు' భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ స్పష్టత

**బలగం టీవీ, లండన్**



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీల మధ్య విభేదాలు నడుస్తున్నాయంటూ వస్తున్న పుకార్లకు ఎట్టకేలకు తెరపడింది. ఇరువురి మధ్య మాటల్లేవంటూ సాగుతున్న ప్రచారాన్ని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ తీవ్రంగా ఖండించారు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డే అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోహ్లీ, గంభీర్ బంధంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఊహాగానాలన్నీ పూర్తిగా అవాస్తవాలని కొట్టిపారేశారు.

నెట్స్ ప్రాక్టీస్ విజువల్స్‌తో మొదలైన రగడ గతేడాది విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినప్పటి నుంచి, కొత్తగా బాధ్యతలు చేపట్టిన హెడ్ కోచ్ గంభీర్‌తో అతనికి సెంటిమెంట్లు కలవడం లేదనే వార్తలు జోరందుకున్నాయి. ముఖ్యంగా ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన మొదటి వన్డేకు ముందు, నెట్స్ ప్రాక్టీస్ సమయంలో వీరిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదనే విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల నేపథ్యంలో జట్టులో వాతావరణం సజావుగా లేదంటూ ప్రచారం సాగింది.



ఈ పుకార్లపై బ్యాటింగ్ కోచ్ కోటక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "విరాట్, గౌతమ్ ఈరోజు కనీసం పది సార్లు మాట్లాడుకుని ఉంటారు. వారిద్దరూ సంభాషించుకోవడానికి మధ్యలో ఎలాంటి వారధులు లేదా మధ్యవర్తులు అవసరం లేదు. ఈ పుకార్లన్నీ ఎక్కడి నుంచి పుట్టుకొస్తాయో నాకైతే అస్సలు అర్థం కావడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. నెట్స్ సమయంలో తాను కోహ్లీతో కేవలం ఫుట్‌వర్క్, సాంకేతిక లోపాలపైనే చర్చించానని, ఆ సమయంలో గంభీర్ పక్కనే ఉండి బ్యాటింగ్‌ను నిశితంగా గమనించారని కోటక్ వివరించారు.

ఆన్-ఫీల్డ్ కెమిస్ట్రీ అద్భుతం.. రెండో వన్డే ఇన్నింగ్స్ సమయంలో కోహ్లీ, గంభీర్ మధ్య వ్యూహాత్మక బంధం కొనసాగిందని కోటక్ ఉదాహరణలతో వివరించారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో పిచ్ నెమ్మదించిందని, షార్ట్ పిచ్ బంతులు అనుకున్నంత వేగంగా రావడం లేదనే కీలక సమాచారాన్ని క్రీజులో ఉన్న కోహ్లీ.. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న హెడ్ కోచ్ గంభీర్‌కు చేరవేశారని, వీరిద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవనడానికి ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

రెండో వన్డేలో భారత్‌కు పరాజయం.. సిరీస్ 1-1తో సమం ఇదిలా ఉంటే, కార్డిఫ్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 44 ఓవర్లలో కేవలం 233 పరుగులకే ఆలౌట్ అయింది. విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ అర్ధ సెంచరీలతో రాణించినప్పటికీ మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. అనంతరం 234 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ జట్టు.. స్టార్ బ్యాటర్ జో రూట్ (99 నాటౌట్) అద్భుత పోరాటంతో విజయాన్ని అందుకుంది. దీనితో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రస్తుతం 1-1 తో సమమైంది. లార్డ్స్‌లో జరగబోయే ఆఖరి వన్డేనే ఇప్పుడు సిరీస్ విజేతను నిర్ణయించనుంది.

## హిట్‌మ్యాన్' ఆఖరి మ్యాచ్ అంటూ ప్రచారం..

### క్రీడా వర్గాల్లో రిటైర్మెంట్ రగడ! లండన్ చేరుకున్న రోహిత్ శర్మ తల్లిదండ్రులు.. 2027 వరల్డ్‌కప్ ప్రణాళికల్లో లేని మాజీ కెప్టెన్?

**బలగం టీవీ, లండన్**



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై జాతీయ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. ఇంగ్లాండ్‌తో ఆదివారం లార్డ్స్ మైదానంలో జరగనున్న మూడో వన్డే మ్యాచ్.. భారత జెర్సీలో 'హిట్‌మ్యాన్' ఆడే ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ కానుందనే ప్రచారం క్రీడా వర్గాల్లో సంచలనంగా మారింది. ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తూ, రోహిత్ శర్మ తల్లిదండ్రులు గురునాథ్ శర్మ, పూర్ణిమ శర్మ ఇప్పటికే లండన్ చేరుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**తల్లిదండ్రుల రాకతో పెరిగిన ఉత్కంఠ**

సుమారు రెండు దశాబ్దాల పాటు సాగిన తన సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌కు రోహిత్ శర్మ ఆదివారం గుడ్‌బై చెప్పబోతున్నాడనే వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఈ చారిత్రాత్మక ఫేర్‌వెల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకే అతని తల్లిదండ్రులు లండన్ వచ్చినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకునే విషయంపై రోహిత్‌కు ముందే స్పష్టత ఉండటంతో, ఆ భావోద్వేగ క్షణాల్లో కుటుంబ సభ్యులు తనతో పాటే ఉండేలా ముందే ప్లాన్ చేసుకున్నారని సమాచారం.

**2027 వరల్డ్‌కప్ ప్రణాళికలే కారణమా?**

బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లను (యశస్వి జైస్వాల్ వంటి వారిని) సిద్ధం చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే ఇంగ్లాండ్ పర్యటన తర్వాత వన్డే ఫార్మాట్ నుండి రోహిత్‌ను పక్కన పెట్టాలని బోర్డు నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయాన్ని సెలక్టర్లు, మేనేజ్‌మెంట్ ఇప్పటికే రోహిత్‌కు వివరించారని, భవిష్యత్తు ప్రణాళికల్లో తన పేరు లేదనే విషయాన్ని స్పష్టం చేశారని సమాచారం.

టీ20, టెస్టు క్రికెట్‌కు ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్.. ప్రస్తుతం కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. అయితే, ఈ రిటైర్మెంట్ వార్తలపై అటు బీసీసీఐ కానీ, ఇటు రోహిత్ శర్మ కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఆదివారం లార్డ్స్ మ్యాచ్ ముగిసిన తర్వాతే ఈ సస్పెన్స్‌కు తెరపడే అవకాశం ఉంది.

**సిరీస్ విజేత ఎవరో తేలేది రేపే!**

భారత్-ఇంగ్లాండ్ మధ్య సిరీస్ డిసైడర్ అయిన మూడో వన్డే ఆదివారం (జూలై 19) మధ్యాహ్నం గం. 3:30 లకు ప్రారంభం కానుంది. తొలి వన్డేలో భారత్ గెలవగా, కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లాండ్ పుంజుకుని విజయం సాధించింది. దీంతో ప్రస్తుతం సిరీస్ 1-1తో సమం కాగా, లార్డ్స్ పోరు ఇరు జట్లకు అత్యంత కీలకంగా మారింది